ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 27.0

నేడు మంత్రి అచ్చెన్నాయుడు రాక

పెదవేగి, జూన్ 10(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు బుధవారం పెదవేగి మండలంలో పర్యటించనున్నారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం 10.30 గంటలకు వంగూరులోని గోపిశెట్టి లక్ష్మీనారాయణ పొలంలో ఏరువాక ప్రారంభిస్తారు. 11 గంటలకు అదే గ్రామానికి చెందిన జాస్తి రాజన్నబాబు కొబ్బరి, కోకో తోటలను పరిశీలించి, రైతులతో సమావేశమవుతారు. అక్కడ నుంచి 11.45 గంటలకు పెదవేగిలో ఎంఎల్‌వీ. ప్రసాద్ ఆయిల్‌పామ్, కోకో తోటను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.15 గంటలకు ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రాసెసింగ్ యూనిట్ (పామాయిల్ ఫ్యాక్టరీ)ని సందర్శించి, ప్లాంట్ మెటీరియల్‌ను రైతులకు పంపిణీ చేస్తారు.

మెగా డీఎస్సీ పరీక్షలకు 20 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ ఆన్‌లైన్ రాతపరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షలకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం షిఫ్టునకు 180 మంది విద్యార్థులకు 178 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 201 మందికి 190, మధ్యాహ్నం షిఫ్టునకు 200 మందికి 193 మంది హాజరయ్యారు. మొత్తంమీద 20 మంది గైర్హాజరయ్యారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, కమిషనర్ భానుప్రతాప్

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : కలెక్టర్

ఏలూరుటూటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి):పారిశుధ్య పనుల్లో అలసత్వం వహించిన కార్మికులను, శానిటరీ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రిసెల్వి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం మెరుగుపడే స్థితి నేటి నుంచి మొదలు కావాలన్నారు. నెలరోజుల తర్వాత మళ్లీ జరిగే సమీక్షలో చివరి నుంచి రెండు స్థానాల్లో నిలిచినవారిని తొలగి స్తామన్నారు. నగరంలో ఎక్కడా చెత్తకనపడకుండా సంపూర్ణ పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దాలన్నారు. రోడ్ల పై చెత్త వేసే వారిపై పెనాల్టీలు విధించడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో వీధిదీపాలు వెలగడం లేదని, తాగునీరు సరిగా అందడంలేదని, అపారి శుధ్యంగా ఉందని ఫోన్‌కాల్స్ వస్తున్నాయన్నారు.ఆస్తి, తాగునీటి, ఖాళీస్థలాల పన్నులపై సమీక్షించారు. పన్నుల వసూళ్లు మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.కమిషనర్ ఎ.భానుప్రతాప్, అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఏసీపీ సురేఖ, ఎంతఈ సురేంద్రబాబు పాల్గొన్నారు.



అమరావతి మహిళలపై సాక్షి టీవీలో చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై జనాగ్రహం చల్లారలేదు. నాలుగో రోజు మంగళవారం జిల్లాలో నిరసనలు కొనసాగాయి. ఏలూరులోని సాక్షి కార్యాలయం వద్ద దెందులూరు నియోజకవర్గం మహిళలు నిరసన తెలిపి కృష్ణంరాజు, కొమ్మినేని చిత్రపటాలను దహనం చేశారు. -లోపలిపేజీలో..

గోదారి తీరాన 'ఉమ్మడి' బలం

- ఏడాదిలోపే పూర్తిగా నిలదొక్కుకున్న టీడీపీ
- కేడర్‌తోపాటు సీనియర్లకు ప్రాధాన్యత
- నామినేటెడ్ పోస్టులతోపాటు తగిన గౌరవం
- జనసేనకు కలిసొచ్చిన కాలం
- పదవులతోపాటు ప్రజల ముందుకు అవకాశం
- నిలదొక్కుకునే దిశగా బీజేపీ
- తగ్గట్టుగానే ఏడాది పొడుగునా పోరాటం



ప్రతిపక్షం నుంచి అధికార పగ్గాలు చేజిక్కించుకునే వరకు ఒకరికొకరు సాయపడ్డారు. ఎత్తులు, పైఎత్తులతో ప్రత్యర్థిని చిత్తు చేశారు. జనం మదిలో పదిలమైన స్థానాన్ని కూడబెట్టుకున్నారు. పార్టీల వారీగా ఎవరంతట వారుగా క్షేత్రస్థాయిలో పూర్తి పైచేయిగా ఈ ఏడాది కాలం కొనసాగింది. ప్రత్యర్థి పార్టీ వైసీపీయే కాబట్టి ఆ పార్టీ ఐదేళ్ల దురాఘాతా లను ప్రజలకు గుర్తుండేలా పదేపదే జాగ్రత్తపడ్డారు. ఉమ్మడి పశ్చిమలో ఒకనాడు విర్రవీగిన ఫ్యాన్ ఇప్పుడు తిరగకుండాపోతే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజల మధ్య నిలువెత్తు లక్ష్యాలతో నిలిచాయి. అధికారం వేరు, పార్టీ విధానాలు వేరనే సూత్రాన్ని పాటిస్తూనే ఎవరి వ్యూహం వారు అమలు చేస్తున్నారు. -లోపలి పేజీలో..

మొక్కలు.. చిక్కులు!



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కోటి మొక్కలు నాటాలని ఈనెల 5న ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. జిల్లాలో 4లక్షల50వేలు అన్ని శాఖ తరపున నాటాల్సిదేనంటూ జిల్లా యంత్రాంగం ఆదేశాలతో ప్రభుత్వ శాఖల్లో గుబులు రేగుతోంది. మండే ఎండల్లో మొక్కలు ఎలా నాటాలన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. నాటిన వాటిని రక్షించడం ఎలా..? ట్రీ గార్డులు ఎవరు సమకూరుస్తారు..? లక్ష్యం ఘనంగా ఉన్నా చేరుకునే దారేది ఏది అంటూ నిట్టూర్పులు వ్యక్తమవుతున్నాయి.

4.50 లక్షల మొక్కలు నాటే లక్ష్యం నెరవేరేనా?

- నాటిన మొక్కలకు రక్షణ ఎలా..?
- 27 శాఖల్లోనూ అంతర్మథనం

(ఏలూరు- ఆంధ్రజ్యోతి) :

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి సల్పుతోంది. పర్యావరణ దినోత్సవం సందర్భంగా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా నాలుగులక్షల 50వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించి అటవీశాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నర్సరీల నుంచి ఉచితంగా సరఫరాను ప్రారంభించింది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలు మొక్కలను తీసుకెళ్లి ఖాళీ స్థలాలు, రోడ్ల వెంబడి నాటుతున్నాయి. ప్రవేట్ సంస్థలు సైతం అటవీశాఖ నర్సరీల నుంచి పెద్ద సంఖ్యలో మొక్కలు తీసుకెళ్తున్నాయి. ఎంపీడీవోల ఆధ్వర్యంలో పదివేలు మొక్కలు ఎక్కడ నాటుతారు? జిల్లాలో 2,225 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే వివిధ ఆకు కూరలు, ఇతర కూరగాయల మొక్కలు పెంపకం చేపట్టారు. ఈ శాఖ పరిధిలోనే 37 వేల మొక్కలు ఎక్కడ నాటుతారన్నది ఆ శాఖలో గుబులు రేగుతోంది. కొన్ని రకాల మొక్కలకే అటవీశాఖ పరిమితం అయితే ఉపయోగం ఉండదు. స్కూల్స్ అంగన్‌వాడీ, ప్రభుత్వ కార్యాలయాల్లో జామ, నేరేడు, బొప్పాయి, కరివేపాకు, ములగచెట్లు అందిస్తే వాటి సంరక్షణకు సిబ్బందిలో ఎవరో ఒకరు ముందుకొస్తారు. అలా కాకుండా అడవి తుమ్మ, తంగేడు, ఇతర భారీ వృక్షాలను నాటిన సంరక్షణ కష్టమేనన్న వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి. ఏర్పాటు చేసిన మొక్కలకు ట్రీ గార్డులను ఆయా శాఖల అధికారులే సమకూర్చుకోవడం కష్టతరమే. చిన్న,చితకాశాఖల్లో నిర్వహణ వ్యయం కష్టంగా ఉంది. తాజాగా ఈ మొక్కల సంరక్షణ చేయడం ఎలా అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది.

వేలల్లో మొక్కలు నాటేదెలా ?

జిల్లాలోని 27 మండలాల్లో ఆయా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని ఇటీవల నిర్ణయించారు. జడ్పీ ఆధ్వర్యంలో 74,790, డ్వామా ఆధ్వర్యంలో 60,750, డీఆర్‌డీఏ 54 వేలు, డీపీవో 33,750, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 33,750, విద్యాశాఖలో 27వేలు, మెప్మా 25వేలు, హౌసింగ్ 27వేలు, వ్యవసాయశాఖ 18,900, ఐటీడీఏ 17,500 మొక్కలు నాటాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఇంత వరకు బాగున్న అటవీశాఖ నుంచి ఈ సంఖ్యల్లో మొక్కలు చేరుకోలేదు. కేవలం వందల్లోనే అందగా, పర్యావరణ దినోత్సవం రోజున చాలా శాఖల్లో స్థానిక నర్సరీల్లో కొనుగోలు చేసి చేతి చమురు వదలిచ్చుకుని మొక్కలు నాటారని సమాచారం. వెయ్యి లేదా రెండు వేలంటే ఏదోరకంగా నాటవచ్చని అంతకుమిచ్చిన సంఖ్యలో మొక్కలు నాటడం ఎలా అని అధికారులు అంతర్మథనం చెందు తున్నారు. ప్రతీ నెల కొంత మేర లక్ష్యాలను నిర్దేశించి ఆగస్టు వరకు ఈ కార్యక్రమం విడతల వారీగా కొనసాగిస్తే నాటిన మొక్కలు నిలుస్తాయి. వర్షాకాలంలో నాటడానికి పరిసరాలు అనువుగా ఉంటాయన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.

గుంతలు.. ట్రీ గార్డుల పరిస్థితేమిటి?

ఒక్క మొక్క నాటాలంటే భూమిని తవ్వాలి. అయితే ఇందుకు సరిపడా పనిముట్లు ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉండవు. వీటికి అటెండర్లనే ఉపయోగించాలి. మొక్కలకు గుంతలు తవ్వేందుకు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తే ప్రతీ గ్రామంలో, మండలంలో లక్ష్యాలు అధిగమించవచ్చని, ట్రీ గార్డుల పరంగా పర్యావరణ హితంగా వెదురుతో తయారు చేసిన వాటిని జిల్లా యంత్రాంగమే కొనుగోలు చేయించి సరఫరా చేయాలన్న సూచనలు వ్యక్తమవుతున్నాయి. పారిశ్రామిక వేత్తలు, షాపుల యజమానుల సహకారంతో మున్సిపాల్టీలు, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద మొక్కల సంరక్షణకు ఆదేశాలు ఇచ్చే దిశగా జిల్లా యంత్రాంగం ఆలోచన చేస్తే లక్ష్యం 4లక్షలు 50 మొక్కలు నాటడం పూర్తవుతుందన్న భావన వ్యక్తమవుతోంది. నాటిన ప్రతీ మొక్కకు జియో ట్యాగింగ్ ఇవ్వడం, దాన్ని ఆయా కార్యాలయాల పరిధిలో నమోదు చేయించడం ద్వారా లెక్కలు తేలుతాయి.



మద్ది క్షేత్రంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జేసీ ధాత్రి రెడ్డి, జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్

మద్ది క్షేత్రంలో యోగాంధ్ర

జంగారెడ్డిగూడెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి):యోగా ఆసనాలను ప్రతీ ఒక్కరూ తమ జీవనశైలిగా మార్చుకోవాలని జేసీ ధాత్రిరెడ్డి అన్నారు. గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జేసీతో పాటు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర నిర్వహించడంతో అంతర్జాతీయ గుర్తింపుతో పాటు మంచి స్ఫూర్తి కలుగుతుందన్నారు. ఈ నెల 18న కామవరపుకోట మండలంలోని గుంటుపల్లి బౌద్ధారామాల వద్ద ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు యోగాసనాలపై అవగాహన కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ మనిషి జీవితానికి అమ్మ తోడు ఎంత అవసరమో దేశానికి యోగాసనాలు అంతే ముఖ్యమన్నారు. ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ఆర్డీవో ఎంవి.రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి, డీఎస్పీ యు.రవిచంద్ర, కమిషనర్ కెవి.రమణ, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ,టీడీపీ పట్టణ,మండల అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్,సాయిల సత్యనారాయణ, నాయకులు రావూరి కృష్ణ,పెనుమర్తి రామకుమార్,రాజాన పండు తదితరులు పాల్గొన్నారు.

7,91,485 మంది పేర్లు నమోదు

ఏలూరుసిటీ : యోగాంధ్ర కార్యక్రమంలో ఇంతవరకు 7,91,485 మంది పేర్లు నమోదు చేసుకున్నారని జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ మంగళవారం తన ఛాంబర్‌లో ఈనెల 13న సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఐదువేల మంది విద్యార్థులతో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై విద్యా, ఆయుష్, నగర పాలక సంస్థ రెవెన్యూ సంబంధిత శాఖలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో భీమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల బదిలీలకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్!

ఏలూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్టు తెలిసింది. ఈ మేరకు మంగళవారం వైద్యవర్గాల్లో విస్తృత చర్చలు జరుగుతున్నాయి. వైద్యఆరోగ్యశాఖలో సాధారణ బదిలీల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా, దరఖాస్తుల స్వీకరణ, తాత్కాలిక సీనియార్టీ జాబితాలు, క్లియర్ వెకెన్సీల జాబితాల విడుదల, వాటిపై అభ్యంతరాలు స్వీకరణ దశలు పూర్తికాగా, అర్జీల పరిష్కారం అనంతరం తుది సీనియార్టీ జాబితాలను విడుదల చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో తప్పనిసరి బదిలీకింద పెద్దసంఖ్యలోనే పీహెచ్‌సీల వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, జూనియర్ అసిస్టెంట్లకు స్థానభ్రంశం ఉంటుంది. వీరితో పాటు మరికొందరు రిక్వెస్టు బదిలీకోసం దరఖాస్తు చేసుకున్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్‌వల్ల పలు సమస్యలు ఎదురవుతుండటం, కాల యాపన తదితర కారణాలతో వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ వైపు ఉన్నతాధికారులు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. దీనికనుగుణంగానే తుది సీనియార్టీ జాబితాల్లోని ఉద్యోగులు ఆయా ప్రాంతాల్లో క్లియర్ వెకెన్సీలకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకునే ప్రక్రియవల్ల కౌన్సెలింగ్ వేగవంతంగా, ప్రశాంతంగా ముగించవచ్చునని భావిస్తున్నారు. ఈ నెల 17లోగా వైద్యఆరోగ్యశాఖలో బదిలీల కౌన్సెలింగ్ ముగియాల్సి ఉంది. కాగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌పై తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక సమాచారం అందలేదని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

వరి విత్తనాలు వచ్చేశాయ్..

- సబ్సిడీపై విత్తనాలు.. 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు
- జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో..



ఏలూరుసిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి):సార్వా సీజన్ ఆరంభం అయింది. జిల్లాలో ఇప్పటికే రైతుల నుంచి రైతులు వరి విత్తనాలను సేకరించుకుని వరి నారుమళ్లకు శ్రీకారం చుట్టారు. జిల్లాకు సంబంధించి అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచినట్టు జిల్లా వ్యవసాయ శాఖ పేర్కొంది. జిల్లాలో ఈ ఏడాది 2,22,347 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా నిర్ణయించగా దీనికి సంబంధించి 11,117 ఎకరాల్లో నారు మళ్ల లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. జిల్లాకు సంబంధించి 10,721 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారు. దీనికి సంబంధించి విత్తనాలు సిద్ధంగానే ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ పేర్కొంది. సార్వా వరి సాగుకు సంబంధించి తణుకులోని ఏపీ సీడ్స్ నుంచి జిల్లాలోని రైతు సేవా కేంద్రాలకు విత్తనాలు సరఫరా చేసినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఏపీ సీడ్స్ ద్వారా సర్టిఫైడ్ సీడ్స్ రైతు సేవా కేంద్రాలకు పంపుతున్నారు. రైతులు తమకు కావాల్సిన విత్తనాల కోసం తమ పేరు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సబ్సిడీపై అందజేస్తారు. జిల్లాకు సంబంధించి ఏపీ సీడ్స్ నుంచి ఆరు వేల క్వింటాళ్ల వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాలకు చేరుకున్నాయి. ప్రధానంగా ఎంటీయూ 1318, ఎంటీయూ 7029, ఎంటీయూ 1064, బీపీటీ 5204, ఎంటీయూ 1061 రకాలతోపాటు ఈసారి సన్న రకమైన ఎంటీయూ 1224 రకం విత్త నాలను సిద్ధంగా ఉంచారు.

సబ్సిడీపై విత్తనాలు

రైతు సేవా కేంద్రాల వద్ద తమ పేరు రిజిస్టర్ చేసుకున్న రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తున్నారు. ఒక విత్తనం బస్తా రూ.1,260 కాగా కిలోకి రూ.5 చొప్పున 30 కిలోలకు రూ.150 సబ్సిడీగా అందిస్తున్నారు. ఒక్కొక్క వరి విత్తనం బస్తా రూ.1110 లకు రైతులకు లభిస్తుంది.

50 శాతం రాయితీపై..

పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు సంబంధించి ఏడు వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు జిల్లాలోని రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేశారు. ఎకరానికి జీలుగ, జనుము విత్తనాలు 10 కిలోలు చొప్పున, పిల్లిపెసర విత్తనాలు 10 కిలోలు చొప్పున 50శాతం రాయితీపై అందజేస్తున్నారు. జిల్లాలో అవసరం మేరకు ఇప్పటికే ఏపీసీడ్స్ నుంచి ఆరు వేల క్వింటాళ్ల వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాం.. ప్రస్తుతం జిల్లాలో నారుమళ్లు వేస్తున్నారంటూ జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా తెలిపారు.

టీచర్ల బదిలీకి అవరోధాలు

- ఎస్జీటీల మాన్యువల్‌కు సాంకేతిక సమస్యలు
- నేటికి ఆరు మున్సిపాల్టీలు, ఏలూరు కార్పొరేషన్ టీచర్ల బదిలీలు వాయిదా
- రేపటిలోగా బదిలీ ప్రక్రియ ముగించాలని విద్యాశాఖ యత్నాలు

■ లోపలి పేజీలో..





టేకూరు గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్‌లు అందిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

సమస్యలుంటే చెప్పండి..పరిష్కరిస్తాం..

ఏజెన్సీ గ్రామం టేకూరులో పర్యటించిన ఎస్పీ కిశోర్

వేలేరుపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న అనుమానాల నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ కే.ప్రతాప్ శివకిశోర్ వేలేరుపాడు మండలంలోని అతిమారుమూల గ్రామమైన టేకూరులో పర్యటించారు. గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంఘ విద్రోహ శక్తులకు ఏ మాత్రం సహకరించవద్దని గ్రామస్థులను కోరారు. సమస్యలు తలెత్తితే వేలేరుపాడు పోలీస్‌స్టేషన్ ఎస్సైకి తెలియజేయాలని ఆ సమాచారాన్ని తమకు పంపిస్తారని తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న కాలంలో వరదలు వచ్చే అవకాశాలున్నాయని వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న విద్యార్థులు మట్టిలో మాణిక్యాలలాగా తయారై విద్యలో ప్రావీణ్యత సాధించి ఉన్నతమైన ఉద్యోగాలను పొందటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారి విద్యాభ్యాసం విషయంలో ఎటువంటి సహాయ సహకారాలు అవసరమైన ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం ముందుంటుందని భరోసా ఇచ్చారు. అలాగే తెలియని యువకులు ఆటల్లో రాణించి జిల్లా పేరుప్రతిష్ఠలను పెంపొందించాలని కోరారు.అనంతరం గ్రామంలోని చిన్నారులకు బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేయగా, గ్రామంలోని యువతకు వాలీబాల్‌కిట్‌లను అందజేసి ఆటల పట్ల మక్కువ పెంచుకోవాలని ప్రోత్సహించారు. అత్యవసర సహాయం కోసం 112కు డైల్‌చేయాలని, వేలేరుపాడు ఎస్సై ఫోన్ నంబర్ 7382623701కు ఫోన్ చేయవచ్చుని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఎస్పీ పర్యటనతో పోలీసులు విస్తృత బందోబస్తు, వేలేరుపాడు ఎస్ఐ నవీన్‌కుమార్, నిర్వహించారు.



ఏలూరు శాంతినగర్ బీసీ సంక్షేమ వసతి గృహంలో దోమలమందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ వసతి గృహాల్లో మలాథియాన్ పిచికారీ

ఏలూరు అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులాలు, దివ్యాంగుల వసతి గృహాల్లో దోమల నిర్మూలనకు ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మంగళవారం కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వ వసతి గృహాల ప్రాంగణాలు, విద్యార్థులుండే గదుల గోడలపై మలాథియాన్-25 ద్రావణాన్ని పిచికారీ చేసే ప్రక్రియను రాగల రెండురోజుల్లో పూర్తిచేయాలని సంకల్పించింది. తొలివిడతగా మంగళవారం ఏలూరు నగరంలోని 15 వసతి గృహాల్లో మలాథియాన్ స్ప్రేయింగ్‌ను పూర్తి చేసినట్టు అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 8 మలేరియా సబ్ యూనిట్ల ఆధ్వర్యంలో ఈ పిచికారీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు వివరించారు. వేసవి సెలవుల్లో హాస్టళ్లు మూసి ఉండటం, ఇటీవల అకాల వర్షాలకారణంగా హాస్టళ్ల ప్రాంగణాలు, గదుల్లో అపారిశుధ్యం నెలకొని దోమలు వ్యాప్తిచెందే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు మలాథియాన్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నట్టు తెలిపారు. గోడలపై పిచికారీ చేసిన కెమికల్ వాసన ప్రభావం కనీసం 4 నుంచి 5 నెలల పాటు ఉంటుందని, కెమికల్ చల్లిన గోడలపై వాలిన దోమల అవయవాలు పనిచేయకుండా నిర్మూలన అవుతాయన్నారు. ఈ కెమికల్ గాఢత తక్కువ మోతాదు, మూడురోజులు ముందు గానే పిచికారీ చేస్తున్నందున విద్యార్థులకు ఎటువంటి శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తబోవన్నారు. డీఎంవో డాక్టర్ ప్రసాద్, మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, వసతి గృహాల వార్డెన్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ప్రవల్లిక



ఏలూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రంలోని కోచిలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే అండర్-23 మహిళా విభాగం 33 బాస్కెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఏలూరుకి చెందిన పీఎల్ ప్రవల్లిక ఎంపికైంది. ఇటీవల చిత్తూరులో జరిగిన అండర్-23 మహిళల అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ కనబరిచిన ప్రవల్లిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, సెక్రటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ కె.మురళీ కృష్ణ, సభ్యులు ప్రవల్లికను అభినందించారు.



కివ్వాక రామాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరిన రామభక్తులు

భద్రాచలానికి పాదయాత్రగా రామభక్తులు

కుక్కునూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలం కివ్వాక గ్రామానికి చెందిన 52 మంది రామభక్తులు పాదయాత్రగా మంగళవారం భద్రాచలం బయలుదేరారు. శ్రీరామమాల ధరించి గ్రామస్థులంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆశీస్తూ పాదయాత్రగా బయల్దేరామని గ్రామస్థులు తెలిపారు. చిలకాల కృష్ణ, బట్టు వీరబాబు, మాధవి, రమణ, విమలా, మారేశ్వరి, కామేశ్వరి తదితరులు ఉన్నారు.

ముగిసిన బండి ముత్యాలమ్మ జాతర

మొగల్తూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతర గతనెల 4న ప్రారంభం కాగా నెల రోజులు పాటు నిర్విఘ్నంగా కొనసాగాయి. ఈనెల 8వ తేదీ ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైన జాతర 9వ తేది రాత్రి అమ్మవారి పూర్ణకుంభాన్ని బండిపై పెట్టి తరలించే ప్రక్రియ కొనసాగింది. బాణసంచా కాల్పులు, తీన్‌మార్ వాయిద్యాలు, బ్యాండ్ మేళాలు మధ్య అమ్మవారి ఘటాలను పూరిపాక నుంచి తరలించారు. అమ్మవారి ఆలయం నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతరేవు వంతెన దాటిం చేవరకూ సుమారు 24 గంటలు సమయం పట్టింది. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అమ్మవారిని దర్శించుకోగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అమ్మవారిని సాగనంపే బండి లాగారు. డీఎస్పీ శ్రీవేద ఆధ్వర్యంలో సీఐ దుర్గా ప్రసాద్, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.





జాతరలో కేరళ సంప్రదాయ నృత్యాలు... జాతర చూసేందుకు వచ్చిన జనం

గోదారి తీరాన ఉమ్మడి బలం



ఏడాదిలోపే పూర్తిగా నిలదొక్కుకున్న టీడీపీ
కేడర్‌తో పాటు సీనియర్లకు ప్రాధాన్యం
నామినేటెడ్ పోస్టులతో పాటు తగిన గౌరవం
జనసేనకు కలిసొచ్చిన కాలం
పదవులతో పాటు ప్రజల ముందుకు అవకాశం
నిలదొక్కుకునే దిశగా బీజేపీ
తగ్గట్టుగానే ఏడాది పొడువునా పోరాటం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గోదావరి జిల్లాల్లో ఇంతకుముందు ఉన్నట్టుగానే తెలుగుదేశం పూర్తిగా నిలదొక్కుకుంది. ఒక్క 2019 ఎన్నికల్లో భారీగా నష్టపోయినా పడిపోయిన చోట వెతుక్కోవాలన్న సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని 2024 ఎన్నికల్లో విజయం సాధించింది. తెలుగుదేశం కేడర్ ఆది నుంచి పార్టీని నమ్ముకుని, వైసీపీ దుశ్చర్యలను ఎదుర్కొని తమను తాము కాపాడుకోవడమే కాకుండా పార్టీకి ఊపిరి పోసేలా ప్రతీ నియోజకవర్గంలోను సమయస్ఫూర్తి ప్రదర్శించింది. అధికారం వస్తే కేడర్‌ను వదిలేస్తారనే కొందరి వాదనలకు బ్రేక్ వేసేలా ఈ ఏడాది పొడుగునా సీనియర్లతో పాటు కార్యకర్తలకు పదవులు కట్టబెట్టారు. గత ఎన్నికల్లో కూటమి కారణంగా పోటీ చేసే అవకాశం కోల్పోయిన గన్ని వీరాంజనేయులు, వలవల బాబ్జి, మంతెన రామరాజు, బూరుగుపల్లి శేషారావు, పీతల సుజాత, కె.ఎస్.జవహర్‌లకు సముచిత ప్రాధాన్యం ఉన్న కార్పొరేషన్‌లలో చైర్మన్‌లుగా నియమించారు. సమాంతరంగా నియోజకవర్గాల్లో కేడర్‌ను నామినేటెడ్ పోస్టుల్లో కూర్చోబెట్టారు. మరికొందరికి పార్టీలో కీలక స్థానాలు లభించాయి. ఏడాదిలో కొంత కాలం పాటు నామినేటెడ్ పోస్టుల కోసం, ప్రాధాన్యత కోసం అత్యధికులు అసంతృప్తికి గురయ్యారు. దీనిని గుర్తించి మహానాడుకు ముందే అందరికీ చోటు కల్పించారు. విశేషం ఏమిటంటే.. ఈ దశాబ్ద కాలంలో జిల్లా పార్టీ అధ్యక్ష హోదాలో ఉన్నవారు మరే ఇతర పదవుల్లోను ఉండేవారే కాదు. ఒక్క సీతారామలక్ష్మీ తప్ప. అలాంటిది గన్ని వీరాంజనేయులు, మంతెన రామరాజులకు అత్యధిక ప్రాధాన్యత కలిగిన ఆప్కాబ్, పారిశ్రామిక మండలి చైర్మన్ పదవులు దక్కాయి. నియోజక వర్గాల్లో మార్కెట్ కమిటీలతోపాటు మిగతా పదవులు దక్కడంతో కొంతలో కొంత కేడర్‌కు న్యాయం జరిగినట్టయ్యింది. ఇంకా పదవులు రాని కొందరికి త్వరలోనే పార్టీ పదవులు దక్కబోతున్నాయి. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈ ఏడాది పొడుగునా జిల్లాకు చెందిన ముఖ్య కార్యకర్తలు, నేతలతో పలుమార్లు భేటీ అవుతూ ఇంకొన్నిసార్లు టెలీ కాన్ఫరెన్సులు, వీడియో కాన్ఫరెన్స్‌తో మమేకం కావడం ఈ ఏడాది పార్టీలో మరింత ఊపు తెచ్చింది. సీనియర్లు పితాని సత్యనారాయణ, మంత్రి రామానాయుడు, ఈసారి పార్టీలో మరింత ముందు వరుసకు చేరువయ్యారు.

జనసేనకు సానుకూలత

ఈ ఏడాది ఆసాంతం జనసేనకు కలిసొచ్చింది. ప్రజలతో పాటు కూటమిలోను ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. జనసేన పోలవరం, ఉంగుటూరు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే స్థానాలను తొలిసారిగా తన ఖాతాలో వేసుకోగలిగింది. గోదావరి తీరాన ఈ సంఖ్యలో ఎమ్మెల్యేలు సమకూరడం ఒక ఎత్తయితే.. దీనికితోడు నామినేటెడ్ పదవుల్లోను జనసేన కోరుకున్నట్టుగానే తెలుగుదేశం తోడ్పాటు అందించింది. ఎన్నికల ముందు నుంచి పరస్పర సహకారంతో ఉన్న ఈ రెండు పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాయి. ఎమ్మెల్యే పదవులే కాకుండా విప్, మంత్రి, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవులు దక్కాయి. ఎమ్మెల్యేగా పోటీ చేద్దామని ఆశించిన రెడ్డి అప్పలనాయుడుకు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఇప్పటికీ ఉమ్మడి పశ్చిమ గోదావరి ప్రాతిపదికగా ఈ పార్టీ కార్యకలాపాలు సాగుతున్నాయి. ఈ జిల్లాకు చినబాబు నాయకత్వం వహిస్తున్నారు. వివిధ నియోజక వర్గాల్లో మరికొంత మందికి కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు దక్కాయి. అక్కడక్కడ మార్కెట్ కమిటీల్లో చోటు లభించగా మరికొన్నింటిలో ఇలాంటి 'దారి' కనిపిస్తోంది. ప్రత్యేకించి ఆ పార్టీలో కీలక నేతగా ఉన్న పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది పొడవునా జనసేనకు అన్ని చోట్ల సానుకూలతే కనిపించింది. కొన్ని నియోజకవర్గాల్లో మినహా మిత్రపక్ష పార్టీలతో సయోధ్య కొనసాగిస్తోంది.

పట్టు బిగించిన బీజేపీ

ఈ ఏడాది పొడవునా బీజేపీ ఏపీలో అధికార భాగస్వామి కావడం ఒక ఎత్తయితే.. జిల్లాలో తన స్థానం మరింత పదిలమయ్యేలా జాగ్రత్తపడింది. నరసాపురం లోక్‌సభ స్థానంలో ఎంపీగా ఉన్న శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రిగా పదోన్నతి ఇస్తే ఇదే నియోజక వర్గానికి చెందిన పాకా సత్యనారాయణను ఈ మధ్యనే రాజ్యసభ సభ్యుడిని చేసింది. ఇప్పుడు ఈ వీరిద్దరు పార్టీకి పూర్తిగా ఊపిరిపోసే దిశగా ముందుకు సాగుతున్నారు. నామినేటెడ్ పదవుల్లో తమకు భాగస్వామ్యం కావాలని తొలుత బీజేపీ పట్టుబట్టినా కూటమిలో తీసుకున్న నిర్ణయం ప్రకారమే ఇప్పటికీ నడుచుకుంటున్నారు. దీనివల్ల బీజేపీ పెద్దగా పదవులు దక్కలేదు. సొసైటీల్లోను, మార్కెట్ కమిటీలు, దేవదాయ కమిటీల్లో తమ పార్టీ వారికి స్థానం కల్పించాలని గట్టిగా కోరుతున్నారు. ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని ఆశించి భంగపడినా అసంతృప్తి చెందకుండా జిల్లాలో పార్టీకి అన్నీ తానై తపన చౌదరి ఇప్పటికీ కష్టపడుతూనే ఉన్నారు. ఆయనతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, కృష్ణప్రసాద్ వంటి నేతలు చురుగ్గా ఉండడంతో పార్టీ మరింత పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తోంది. కైకలూరు నుంచి డాక్టర్ కామినేని శ్రీనివాస్ రెండోసారి గెలుపొందడం మరింత ఊపునిచ్చింది. అయినంపూడి శ్రీదేవి, కపర్ధి, పేరిచర్ల సుభాశ్, అల్లూరి సాయిదుర్గరాజు, సుబ్రహ్మణ్యంలాంటి నేతల టీమ్ పశ్చిమలో పార్టీ కోసం విరామం లేకుండా శ్రమిస్తోంది.

ట్రిపుల్ ఐటీకి 50,541 దరఖాస్తులు

నూజివీడు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలో గల నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశానికి మొత్తం 50,541 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు రీషెడ్యుల్ చేసిన అనంతరం 1340 మంది విద్యార్థులు దరఖాస్తు చేసినట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడు, ఆర్కే.వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో 4400 ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సీట్లకు గాను అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. తొలుత 49,201 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో తప్పిదాల వల్ల ట్రిపుల్ ఐటీ ప్రవేశాల గడువును పెంచాలని పాఠశాల విద్యాశాఖ కోరింది. ఈ నేపథ్యంలో అడ్మిషన్ల ప్రక్రియను రీ షెడ్యూల్ చేస్తూ ఈ నెల 2 నుంచి 10 వరకు దరఖాస్తుల స్వీకరించనున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికారులు ప్రకటించారు. దీంతో నూతనంగా 1340 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు, మొత్తం 50,541 మంది విద్యార్థులు దరఖాస్తు చేసినట్లు రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

పార్కింగ్ ప్రాంతంలో వాహనాలకు రక్షణ కరువు



భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ ఆవరణ బయట ఎండలోనే ద్విచక్ర వాహనాలు

భీమవరం క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమృత్ పనుల్లో భాగంగా భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో నూతనంగా భవనాలు, ప్లాట్‌ఫారం, షెడ్లు నిర్మిస్తున్నారు. రానున్న రోజుల్లో ఆధునిక వసతులతో ఈ స్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు, పాసింజర్ రైళ్లు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా రైల్వేస్టేషన్ బయట మాత్రం వాహనదారులకు చుక్కలు కనబడుతున్నాయి.పార్కింగ్ ఫీజులు అధికంగా చెల్లించినప్పటికీ వాహనాలను ఆరుబయటే ఉంచడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. గతంలో స్టేషన్ బయట షెడ్డు ఏర్పాటు చేసి వాహనాలు అందులో పార్కింగ్ చేసేవారు. స్టేషన్ ఆధునీకరణలో భాగంగా షెడ్డు తొలగించారు. పార్కింగ్ కోసం తాత్కాలిక రక్షణ ఏర్పాటు చేయకుండానే పార్కింగ్ ఫీజులు వసూలు చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికైతే ఏ స్టేషన్‌కైనా పార్కింగ్ ప్రదేశాలు ఉండవని, ఎవరి వాహనాలను వారే భద్రపరచుకోవలసిన అవసరం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలన్నది అధికారులే చెప్పాలి. రాత్రి వేళల్లో ఎక్కువ రైళ్ల రాకపోకలు జరుగుతూ ఉంటాయి. ఆ సమయంలో అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఆర్పీఎఫ్ పోలీసులు ఉన్నప్పటికీ పార్కింగ్ విషయంలో వారు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాహనాలను నిబంధనల ప్రకారం లైన్‌లో పెట్టించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తాత్కాలికంగా షెడ్డు ఏర్పాటు చేస్తాం
దినేష్, పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్

ప్రస్తుతం ఉన్న షెడ్డును ఆధునీకరణలో భాగంగా తొలగించాల్సి వచ్చింది. తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం ప్రీమియం పార్కింగ్ వల్ల కొంత అదనంగానే సొమ్ము వసూలు చేయాల్సి వస్తున్నది. జనరల్ పార్కింగ్ అందుబాటులోకి వస్తే పార్కింగ్ ఫీజులు కొంతవరకు తగ్గే అవకాశముంది. కాంట్రాక్టు దారుడు వాహనాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. స్టేషన్ ఆధునీకరణ పూర్తయిన అనంతరం ఇద్దరికి కాంట్రాక్ట్‌లు ఇచ్చే అవకాశముంది. ఎవరైనా పార్కింగ్ ఫీజులు అధికంగా వసూలు చేస్తే సంబంధిత స్టేషన్ మాస్టర్‌కు ఫిర్యాదు చేయండి.

చెరువులిలా !



అడుగంటిన నరసాపురం మునిసిపల్ మంచినీటి చెరువు

గ్రామాల్లో మంచినీటి చెరువులు అడుగంటాయి.. నీరు పసర్లు పట్టి దుర్వాసన వస్తున్నాయి.. దీంతో తాగునీటికి జనం అవస్థలు పడుతున్నారు.. కాల్వలకు నీరు విడుదల చేస్తేగానీ చెరువులు నిండే పరిస్థితి లేదు.. అధికారులు గ్రామాల్లో తాగునీటి సరఫరాపై దృష్టి సారించాల్సి ఉంది..

దాహం తీరేదెలా ?
అడుగంటిన మంచినీటి చెరువులు
తాగునీటికి ప్రజల అవస్థలు

ఆకివీడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో మంచినీటి చెరువులు అడుగంటాయి. పట్టణ పరిధిలో భుజబలరాయుడు, బుజబలరాయుడు స్టోరేజ్ ట్యాంకు, గాలిబ్, ఆనాల, ధర్మాపురంలోని మంచినీటి చెరువుల ద్వారా ఇరవై వార్డుల్లోని సుమారు యాభై వేల ప్రజానీకానికి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. కాలువలు వదిలినా స్థానిక వెంకయ్య వయ్యేరులోకి నేటికి నీరు రాకపోవడంతో చెరువులకు నీరు పెట్టలేని పరిస్థితి. ఈనెల పదిహేను తరువాత గాని చెరువులు నింపుకోలేని పరిస్థితి. ఇప్పటికే మంచినీటి చెరువులు అడుగంటడంతో తాగునీరు పేడ రంగులో వస్తున్నాయి. మంచినీరు సరఫరా చేసే పైపులైన్లు వేసి సుమారు 70 ఏళ్ళు కావస్తుండడంతో అక్కడక్కడ పగిలిపోతుండడంతో మురుగునీరు చేరి తాగునీరు కలుషితమవుతుంది. ఆ నీటినే సరఫరా చేస్తుండడంతో దుర్వాసనతో వాడకానికి కూడా కొందరు వినియోగించడం లేదు. దొరగారి, కొండయ్య చెరువులు ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేసి, రెండు ట్యాంకులు నిర్మాణం చేసి పైపులైన్లు వేస్తే సమస్య తీరుతుంది. పరిమళ లాకుల నుంచి తాగునీరు వచ్చినా పైపులైన్లు మార్చకపోతే నీరు కలుషిత అవుతూనే ఉంటుంది. పాలకవర్గం, అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఆకివీడులో అడుగంటిన భుజబలరాయుడు మంచినీటి చెరువు

కాల్వలకు నీరొస్తేనే..

నరసాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మంచినీటి చెరువు అడుగంటింది. 40 రోజులుగా ఈ చెరువులోని నీటినే పట్టణ ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఎండలు, రోజూ రెండు పూటలా సరఫరా చేయడం వల్ల చెరువులో నీటి మట్టం ప్రస్తుతం నాలుగు ఆడుగులు మాత్రమే ఉంది. ఈ నీరు మరో నాలుగైదు రోజులకు మాత్రమే సరిపోతుంది. ఈ లోపు కాల్వకు నీరు వస్తే యుద్ధ ప్రాతిపదికన పట్టుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో ఏ పురపాలక సంఘానికి లేని అతి పెద్ద మంచినీటి చెరువు నరసాపురం మునిసిపాల్టీకి ఉంది. 50 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈచెరువు లోతు 18 అడుగులు. మూడు ఆడుగుల మేర సిల్ట్ పేరుకుపోవడంతో 15 ఆడుగులు మాత్రమే నీటి మట్టాన్ని నిల్వ చేయగలగుతున్నారు. ఇది 40 రోజులకు సరిపోతుంది. ఈసారి వేసవిలో అధికారులు రెండు పూటలా నీటిని సరఫరా చేశారు. ఎండలు కూడా ఎక్కువుగా ఉండటంతో చెరువు అడుగంటింది. ప్రస్తుతం పురపాలకం రోజుకు రెండు పూటల 18 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తుంది. ప్రస్తుతం ఉన్న నీటి మట్టాన్ని రెండు పూటలా సరఫరా చేయాలంటే నాలుగైదు రోజులకు మించి రాదు. దీంతో కాల్వలకు నీటి విడుదల జరిగితే ప్రజలకు మంచినీటి సరఫరా చేయగలరు. దీనిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. మంగళవారం ఇరిగేషన్ అధికారులతో కాల్వల నీటి సరఫరా గురించి ఆరా తీశారు. శుక్రవారం నాటికి వస్తుందని చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. రెండురోజులు చెత్తా, చెదారం కొట్టుకొచ్చే అవకాశం ఉన్నందున ఆ నీటిని నింపకుండా అదివారం నుంచి అదనపు మోటార్లు ఏర్పాటు చేసి చెరువులో నీరు నింపేందుకు రెడీ అవుతున్నారు.

వరిఘేడులో పసర్లు పట్టి దుర్వాసన

అత్తిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు రక్షిత తాగునీరు అందించడంలో అధికారులు, యంత్రాంగం విఫలమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మేజర్ గ్రామం అయిన వరిఘేడులో చెరువు అడుగంటి నీరు పసర్లు పట్టింది. రక్షిత మంచినీటి పథకం, ట్యాంకు చుట్టూ అపరిశుభ్రమైన వాతావరణంలో చెత్తా, పిచ్చి మొక్కలు పెరిగాయి. నీటి సంపు చుట్టు కూడా కనీసం పంచాయతీ శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. గ్రామాల్లో గ్రామ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రతి 15 రోజులకొకసారి ట్యాంక్ శుభ్రపరిచి నోటీసు బోర్డు మీద నమోదు చేయాల్సి ఉండగా అవేమి పట్టించుకోకుండా మండలంలోని గ్రామాలలో గ్రామ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండల స్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, డిప్యూటీ ఎండివో, ఎంఓఓ, వైద్యాధికారులు గ్రామాలలో కనీసం రక్షిత మంచినీటి పథకాలను సందర్శించిన సందర్భం లేదు.



వరిఘేడులో నీరు అడుగంటి పసర్లు పట్టిన చెరువు

టీచర్ల బదిలీకి అవరోధాలు

- సాంకేతిక సమస్యలతో కౌన్సెలింగ్‌లో జాప్యం
- రాత్రి అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రక్రియ
- నేటికి వాయిదా వేస్తూ అధికారుల నిర్ణయం

ఏలూరు అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో సాంకేతిక సమస్యలు ఒకదానివెంట మరొకటి తలెత్తుతుండటం, వాటిని పరిష్కరించేలోపే వేరొక అడ్డంకులతో వాయిదా వేశారు. ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయుల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్ స్థానే మంగళవారం నుంచి మాన్యువల్ కౌన్సెలింగ్ రాత్రి 8.30 గంటల తర్వాత ప్రారంభమైంది. అంతలోనే సాంకేతిక అవరోధాలతో రాత్రి 10.25 గంటలకు కౌన్సెలింగ్‌ను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ ప్రకటించారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఏలూరు కార్పొరేషన్ ఎస్జీటీలకు, 11 గంటల నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల టీచర్లకు కౌన్సెలింగ్ చేపడతారు. తొలుత ప్రకటించిన షెడ్యూలు ప్రకారం మంగళవారం 264మంది మునిసిపల్ టీచర్లకు, 169 మంది కార్పొరేషన్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. వీరిలో కేవలం ఆరుగురు టీచర్లకు పూర్తయిన తర్వాత రాత్రి 9గంటల సమయంలో నిలిచిపోయింది. ఉమ్మడి జిల్లాలోని ఆరు పురపాలక సంఘాల టీచర్లంతా కౌన్సెలింగ్ కోసం ఏలూరు జడ్పీ ప్రాంగణంలోనే వేచిఉన్నారు.

పాస్‌వర్డ్‌తో ప్రతిష్టంభన

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం ఏలూరు కాగా ప్రస్తుతం ఎస్జీటీలకు నిర్వహిస్తోన్న మాన్యువల్ కౌన్సెలింగ్‌లో ఖాళీలకు ఐచ్ఛికాలు ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ అందుబాటులోకి తెచ్చిన లింక్‌ను ఓపెన్ చేయడానికి పాస్‌వర్డ్‌ను భీమవరం కేంద్రంగా వున్న పశ్చిమ గోదావరి జిల్లాకు కేటాయించడంతో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఏలూరు కేంద్రంగా జరుగుతున్న ఉమ్మడిజిల్లా టీచర్ల బదిలీల ప్రక్రియను ప్రారంభించడానికి సమస్యలు తలెత్తాయి. విద్యాశాఖ ఐటి సెల్ ఈ సమస్యను గుర్తించి పరిష్కరించేసరికే రాత్రి 8గంటలు దాటింది. వెంటనే మునిసిపల్ ఎస్జీటీలకు కౌన్సెలింగ్‌ను ప్రారంభించినా తొలి ఆరుగురు టీచర్లు ఐచ్ఛికాలను ఇచ్చిన వెంటనే ప్రిఫరెన్షియల్ కేటగిరీ స్థానాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసి సమస్యను ఐటి సెల్‌కు తెలియజేశారు.

విద్యాశాఖ సిబ్బందిపై ఒత్తిడి

దాదాపు 21 రోజులుగా టీచర్ల సాధారణ బదిలీల ప్రక్రియలో నిమగ్నమైన డీఈవో కార్యాలయ సిబ్బందిపై మాన్యువల్ కౌన్సెలింగ్ మరింత భారాన్ని మోపిందని ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉమ్మడి జిల్లా డీఈవో కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులను రాజమండ్రి, భీమవరం కేంద్రాలకు విభజించిన విషయం విదితమే. ప్రస్తుత బదిలీల నిర్వహణను ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులకు వర్తింపజేసి ఏలూరు డీఈవో కార్యాలయానికి బాధ్యతలను అప్పగించడంతో ఆఫీసు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేసరికి రాత్రి రెండు గంటలు దాటుతోందని, మళ్లీ మరుసటి రోజు ఉదయం 7గంటలకే కార్యాలయానికి వస్తున్నామని, మూడు వారాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని విద్యాశాఖ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపటిలోగా పూర్తిచేస్తాం : వెంకటలక్ష్మమ్మ, డీఈవో

పలు జిల్లాల్లో మాన్యువల్ కౌన్సెలింగ్‌కు సాంకేతిక అవరోధాలు ఎదురవుతున్నట్టు సమాచారం అందుతోంది. ఏలూరు కార్పొరేషన్ టీచర్లకు, 6 పురపాలక సంఘాల టీచర్లకు బుధవారం ఉదయం 8గంటల నుంచే ప్రారంభిస్తాం. ఆ వెంటనే జడ్పీ, ఎంపీపీ యాజమాన్య పాఠశాలల ఎస్జీటీలకు మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తాం. ఉమ్మడి జిల్లాలో మునిసిపల్ టీచర్లు 264 మంది, ఏలూరు నగరపాలక సంస్థ ఎస్జీటీలు 169 మంది, జడ్పీ, ఎంపీపీ యాజమాన్య ఎస్జీటీలు 2239 మందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఎస్జీటీలందరికీ ఈ నెల 12న ఎంత ఆలస్యమైనా బదిలీలు పూర్తి చేస్తాం.

ఉమ్మడి జిల్లాలో అధికారుల బదిలీ

ఏలూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాల్లో వివిధ శాఖల్లో బదిలీల చివరి రోజు పొద్దుపోయే వరకు జాబితాలు విడుదలవుతూనే ఉన్నాయి. మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానశాఖ, సహకార శాఖల్లో బదిలీల సోమవారం రాత్రి కొనసాగుతూనే వచ్చాయి. ఏలూరు నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఈ.రాజేంద్ర కృష్ణ ఏపీసీఆర్‌డీఏ ఎస్ఈగా డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఏలూరు పబ్లిక్ హెల్త్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు విజయవాడలోని ఏపీయూఎఫ్ఐడీసీ ఈఈగా బదిలీ అయ్యారు. భీమవరం మునిసిపల్ డీఈ కె.ఫణి భూషణ్‌రావును ఏలూరు ఈఈ ఇన్‌చార్జిగా నియమించారు.

పశు సంవర్థకశాఖ నూజివీడు డిప్యూటీ డైరెక్టర్ కె.చంద్రశేఖర్‌ను విజయవాడ డీడీ, అక్కడి డీడీ జి.రమేష్‌ను నూజివీడుకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ పీవీఎస్ రవికుమార్ ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా బదిలీ చేశారు. ఏలూరు ఉద్యానశాఖలో డిప్యూటీ డైరెక్టర్ ఎస్ రామ్మోహన్‌కు మైక్రో ఇరిగేషన్ పీడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అనకాపల్లి జిల్లా ఉద్యానశాఖాధికారి జి ప్రభాకర్ రావును పశ్చిమగోదావరి జిల్లా ఉద్యానశాఖాధికారిగా బదిలీ చేశారు. ఏలూరు జిల్లా పట్టు పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.వాణిని అన్నమయ్య జిల్లా రాయచోటి జిల్లా శాఖ కార్యాలయంలో జిల్లా సెరీకల్చర్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీసీవో (జిల్లా సహకార అధికారి) ఎస్.మురళీకృష్ణను భీమవరం, పశ్చిమ డీసీవో నాగరాజు నరసరావుపేట బదిలీ అయ్యారు. వ్యవసాయ శాఖలో బదిలీ అయిన అధికారుల వివరాలు..

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డిప్యూటీ డైరెక్టర్		
వి.బోసుబాబు	ఏలూరు జిల్లా	కోనసీమ జిల్లా
బి.శ్రీనివాసులు	కోనసీమ జిల్లా	ఏలూరు జిల్లా
అసిస్టెంట్ డైరెక్టర్		
జె.శశిబిందు	తాడేపల్లిగూడెం	నిడదవోలు
వీవీఎస్ఎస్‌పీ.ప్రసాద్	నిడదవోలు	తాడేపల్లిగూడెం
పి.చంద్రశేఖర్	కొవ్వూరు ఏడీఏ	నిడదవోలు
జి.నరేంద్ర	తాడేపల్లిగూడెం	తణుకు
వై.సుబ్బారావు	ఏలూరు	చింతలపూడి
కేఎఎస్.సాయిశ్రీనివాసరావు	ఆకివీడు ఏడీఏ	భీమవరం
ఎంవీ.రమేష్	తణుకు	మార్టేరు
కె.ప్రతాప్ జీవన్	రంపచోడవరం	ఆకివీడు
ఈఎస్ భాస్కరరావు	సామర్లకోట	నరసాపురం
పి.మాధవి	కైకలూరు	సామర్లకోట
డీటీసీ ఏడీఏలు		
ఎస్.కవిత	ఏలూరు	గుడివాడ
పి.లలితా సుధ	ఏలూరు	తాడేపల్లిగూడెం
ఏడీఏ(ఆర్)		
పి.మురళీకృష్ణ	తాడేపల్లిగూడెం	కొవ్వూరు
ఈ.అనిల్ కుమారి	నరసాపురం	ఏలూరు
జి.శైలజ	జగ్గంపేట	ఏలూరు


తాడేపల్లిగూడెంలో కూటమి నాయకులు, మహిళల ర్యాలీ


తడికలపూడిలో నినాదాలు చేస్తున్న మహిళలు, నాయకులు


ఏలూరు నగరంలో మహిళల నిరసన ప్రదర్శన



పాలకొల్లులో నల్ల బెలూన్లతో మహిళల ప్రదర్శన

అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు దారుణం

- సాక్షి యాజమాన్యం క్షమాపణ చెప్పాలి
- పత్రిక, చానల్‌ను నిషేధించాలి
- మహిళల్లో పెల్లుబికిన ఆగ్రహం
- పత్రిక ప్రతులు దహనం

రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ సాక్షి చానల్ యాంకర్, విశ్లేషకుడు అసభ్యకర వ్యాఖ్యలు చేయడంపై మహిళల నిరసన కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో మూడో రోజు మంగళవారం పలుచోట్ల ఆందోళనలు చేపట్టి పత్రిక ప్రతులు దహనం చేశారు. సాక్షి యాజమాన్యం క్షమాపణ చెప్పాలను మహిళలు డిమాండ్ చేశారు. సాక్షి మీడియాను నిషేధించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నల్ల జెండాతో మానవహారం

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడంతో పాటు రాష్ట్రంలో మహిళల వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తున్న సాక్షి యాజమాన్యం తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు మహిళలు, జనసేన, బీజేపీ మహిళా నాయకులు గాంధీ బొమ్మల సెంటర్‌లో మంగళవారం ఆందోళన చేపట్టారు. నల్ల బెలూన్లు, 100 మీటర్ల నల్ల జెండాతో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. సాక్షి యాంకర్, విశ్లేషకుడు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పత్రిక, చానల్ యాజమాన్యం జగన్, భారతీ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి ఛానల్, పత్రికను నిషేధించాలని పెద్ద పెట్టున నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు దబ్బా ఎస్తేరు రాణి, ప్రధాన కార్యదర్శి పెండ్యాల భవాని, విజయలక్ష్మి, పులి మాధురి, ఎ.లక్ష్మీజ్యోతి, ఎం.మహాలక్ష్మి, రెల్లి రమాదేవి, కాసాని శశిరేఖ, పోతుల మంగాదేవి, ద్రాక్షారపు జ్యోతి, తాళ్లూరి విజయలక్ష్మి, కౌరు నాగలక్ష్మి, కొండేటి లక్ష్మి కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామోహన్, పెచ్చెట్టి బాబు, జీవి, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, తమ్మినీడి సత్యనారాయణరావు పీతల శ్రీనివాస్, సలాది రాము, గాదె వెంకన్న, కేశవ, ఎ దుర్గారావు, ఎం రాంప్రసాద్ సంఘీభావం తెలిపారు.

అసభ్యకర వాఖ్యలు హేయం

తాడేపల్లిగూడెం అర్బన్: అమరావతి మహిళలపై అసభ్యకరమైన వాఖ్యలు చేయడం హేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. సాక్షి చానల్‌లో మహిళలపై అసభ్యకర వాఖ్యలకు నిరసనగా కూటమి నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తాలూకా సెంటర్ నుంచి పట్టణంలోని పోలీస్ ఐలాండ్ వరకూ ర్యాలీ సాగింది. అనంతరం సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్, గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, గంధం సతీష్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి సుబ్బరాజు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అవమానిస్తే సహించం

తణుకు: మహిళలను అవమానిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హెచ్చరించారు. తణుకు నరేంద్ర సెంటర్‌లో తెలుగు మహిళలు, నాయకులు నిరసన, ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. తక్షణమే సాక్షి మీడియా అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దుష్ప్రచారం చేస్తున్న జగన్ ముఠా దౌర్జన్యాలను తీవ్రంగా ఖండించారు. భారతీరెడ్డి నిర్వహణలో ఉన్న సాక్షి మీడియాలో అమరావతి మహిళలను అవమానించే వ్యాఖ్యలు చేయడం గర్హనీయమన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి సైతం పశ్చాత్తాపం లేకుండా అమరావతి మహిళలను సంకర జాతులు అంటూ నీచంగా మాట్లాడడం దారుణమని, సజ్జలపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళలను కించపరుస్తారా..!

ఏలూరు టూటౌన్: మహిళలను గౌరవించే సంస్కృతి వైసీపీలో లేదని టీడీపీ నగర మహిళా అధ్యక్షురాలు తవ్వా అరుణకుమారి, అధికార ప్రతినిధి కడియాల విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి మహిళలను కించపరిచే వ్యాఖ్యలపై నిరసనగా తెలుగు మహిళలు నగరంలో ర్యాలీ నిర్వహించారు. వసంత్‌మహల్ పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి పాత బస్టాండ్ వరకు మహిళలు ర్యాలీ నిర్వహించారు. తల్లి, చెల్లిని బయటకు గెంటేసిన జగన్‌కు ఆడపడుచుల విలువ తెలియదన్నారు. సాక్షి యాజమాని భారతీరెడ్డి రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరూ కూడా మహిళల పై అనుచితంగా మాట్లాడాలంటే భయపడేవిధంగా శిక్షలు ఉండాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కిలారిశెట్టి సంధ్యా, సంతోషి, శ్రీదేవి, పద్మా, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మీడియాను నిషేధించాలి

కామవరపుకోట: మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు ప్రసారం చేస్తున్న, ప్రోత్సహిస్తున్న సాక్షి మీడియాను నిషేధించాలని తడికలపూడిలో కూటమి నాయకులు, మహిళా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేశారు. కొత్తగూడెం రామాలయం నుంచి మహిళలు ప్లకార్డులతో తడికలపూడి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళలతోపాటు నాయకులు ఏలూరి హరిరామకృష్ణ, కోనేరు సుబ్బారావు, ఘంటా సుధీర్‌బాబు, వెలమటి నాగేశ్వరరావు, మేరుగు సుందరరావు, నెక్కలపు గంగాధరరావు, నెల్లూరి సత్తిబాబు, అబ్బూరి లక్ష్మీనారాయణ, సురేష్, బొబ్బిలి డాన్ దివాకర్, తుమ్మల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి రాలేదు

భీమవరం అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేశ్యల రాజధానిగా వ్యాఖ్యానించడం దారుణమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి అన్నారు. రాయలంలో మంగళవారం సాక్షి దినపత్రిక ప్రతులను తగల బెట్టారు. అమరావతి రాజధాని మహిళలు, ప్రజలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్, యాజమాన్యంపై చర్యలు తప్పవన్నారు. ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా వైసీపీ వారికి బుద్ధి రాలేదన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరు: తహసీల్దార్ కార్యాలయం నుంచి హైవే వరకు తెలుగు మహిళలు ర్యాలీ నిర్వహించారు. శరణాల మాలతీరాణి, అక్కిన నాగమణి, ఉన్నమట్ల సునీతరాణి, యెగ్గిన శ్యామల, అడపా శోభారాణి, బండారు సింధు, దిడ్ల అలకనంద పాల్గొన్నారు.

యజమాని ఇంట్లో బంగారం చోరీ

- పోలీసులకు చిక్కిన నిందితుడు
- 33 కాసుల ఆభరణాలు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు, కేసు వివరాలు చెబుతున్న ఎస్పీ కిశోర్, స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

ఏలూరు క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రొయ్యల చెరువుల యజమాని వద్ద పనిచేసే యువకుడు యజమాని ఇంటికి కన్నం వేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిఘా పెట్టి అతడిని అరెస్టు చేశారు. రూ.23.76 లక్షల విలువైన 33 కాసుల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిశోర్ వివరాలు తెలిపారు. గణపవరం గ్రామానికి చెందిన చిలువూరి వెంకట రామరాజు అలియాస్ వెంకన్నబాబు రొయ్యల చెరువుపై అదే గ్రామానికి చెందిన సరిపల్లి రాజు అలియాస్ వెంకటరాజు (32) పనిలో చేరాడు. పేకాట, మద్యం, క్రికెట్ బెట్టింగ్‌కు సరిపల్లి రాజు బానిస అయ్యాడు. అతని జీతం సరిపోకపోవడంతో యజమాని ఇంట్లో దొంగతనం చేయాలని పథకం వేశాడు. గత మే నెలలో ఇంటి యజమాని హైదరాబాద్ వెళ్లారు. జూన్ మొదటి వారంలో రాత్రిపూట సరిపల్లి రాజు ఆ ఇంటికి వెళ్లి వెనకవైపు తలుపులు పగులగొట్టి, బెడ్రూమ్‌లో బీరువా కూడా పగులగొట్టి 262.780 గ్రాముల (సుమారు 33కాసులు) బంగారు ఆభరణాలు అపహరించుకుపోయాడు. ఈ సంఘటనపై గణపవరం పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, గణపవరం ఎస్ఐ మణికుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఏయాజీ.శంకర్, కానిస్టేబుల్ శివాజీ, హోంగార్డు పి.జగపతిబాబు ప్రత్యేక బృందంగా ఏర్పడి నిఘా ఉంచారు. సరిపల్లి రాజు మంగళవారం తాను దొంగిలించిన బంగారాన్ని భీమవరంలో విక్రయించడానికి వెళుతుండగా సరిపల్లి వద్ద అతడిని అరెస్టు చేశారు. అతడి వద్ద 33 కాసుల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణలో చాకచక్యంగా పనిచేసిన అధికారులు సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను అందించారు.

పోలవరం సమస్యలు పరిష్కరిస్తాం : నిమ్మల


మంత్రి నిమ్మలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

పోలవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పోలవరం నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన మంత్రి నిమ్మలను ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శాలువా కప్పి సన్మానం చేశారు. నియోజకవర్గంలో పలు సమస్యలు వివరించి వినతిపత్రం సమర్పించారు. పోలవరం నీటి సంఘం అధ్యక్షుడు పాదం ప్రసాద్, పోతుల శ్రీను, బెజవాడ గోపి ఉన్నారు.

తమకు పరిహారం అందలా చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారా మరాజు మన్యం జిల్లా వీఆర్‌పురం మండలం రామవరం నిర్వాసితులు మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో 266 కుటుంబాల్లో 104 కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. జిల్లా కలెక్టరుతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం

పోలవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూడు రోజులుగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం మంగళవారం స్వల్పంగా తగ్గింది. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే ఎగువన 25.960 మీటర్లు, దిగువన 16.800 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాం ఎగువన 25.980 మీటర్లు, దిగువ కాపర్ డ్యాంకి దిగువన 14.250 మీటర్ల నీటిమట్టం నమోదైంది. గోదావరిలోకి అదనంగా వస్తున్న జలాలను పోలవరం ప్రాజెక్ట్ 48 గేట్ల నుంచి విడుదల చేస్తున్నారు. 23,329 క్యూసెక్కుల జలాలను స్పిల్ వే నుంచి దిగువకు విడుదల చేసినట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజులుగా పెరిగిన గోదావరి నీటిమట్టంతో పోలవరం ప్రాజెక్టు దిగువన గూటాల వరకు ఇసుక తిన్నెలు నీట మునిగాయి.

మద్యం కోసం తల్లిని చంపేశాడు

నిందితుడికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కన్న తల్లినే చంపేశాడు. కొబ్బరి కోరు పీటతో తలపై, ముఖంపై కొట్టి హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఏలూరు ఏడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (ఫ్యామిలీకోర్టు) వై.శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2024 ఫిబ్రవరి 11న రాత్రి 7 గంటల సమయంలో తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడిచర్ల గ్రామానికి చెందిన సర్వేపల్లి వెంకట్రావు (48) తల్లిని మద్యానికి డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించడంతో కొబ్బరి కోరు కత్తిపీటతో తల, ముఖంపై కొట్టాడు. తీవ్ర గాయాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా అదే రోజు రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటనపై అప్పటి తడికలపూడి ఎస్ఐ జయబాబు కేసు నమోదు చేయగా అప్పటి సీఐ ఎం.సుధాకర్ కేసు దర్యాప్తు చేసి సర్వేపల్లి వెంకటరావును అరెస్టు చేశారు. అప్పటి చింతలపూడి సీఐ పి రాజేష్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని 7వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. వెంకట్రావుపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి వై శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఆచంట వెంకటేశ్వరరావు, వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్, జంగారెడ్డిగూడెం సీఐ వి కృష్ణబాబు, తడికలపూడి ఎస్ఐ పి చెన్నారావు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కె రఫీ సహకరించారు. కేసు విచారణలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అభినందించారు.


దుకాణంలో చిక్కుకున్న ట్రాక్టరు ట్రక్

దుకాణాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్ ట్రక్

పోలవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టరు ట్రక్ రివిట్ ఊడిపోవడంతో పక్కనే దుకాణాలలోకి దూసుకుపోయింది. మంగళవారం ఇటుకలకోట నుంచి ఇటుకల లోడుతో కొవ్వూరు వైపు వెళుతున్న ట్రాక్టరు పోలవరం ఏటిగట్టు ఎక్కుతున్న క్రమంలో రివిట్ ఊడిపోయింది. దీనితో ట్రక్ వెనక్కి దూసుకువచ్చి రోడ్డు పక్కనే జలేపల్లి వెంకట నరసింహారావు పాన్‌షాపులోకి దూసుకుపోయింది. ఆకుకూరలు, కూరగాయల విక్రయాలతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. కూరగాయల దుకాణం దుకాణం మూసి ఉండడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో ట్రాక్టర్ ట్రక్ వెనక్కి దొర్లుతూ వస్తున్న విషయం గమనించి అప్పటికే అక్కడ నిలబడి ఉన్న వారిని స్థానిక హోటల్ నిర్వాహకుడు హెచ్చరించడంతో ప్రమాదం తప్పింది. షాపుల ముందు భాగాలు దెబ్బతిన్నాయి.


వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జాతీయ రహదారిపై వాహనాల వేగం తనిఖీ

ఏలూరు క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్‌గన్‌తో పోలీసులు మంగళవారం తనిఖీ చేపట్టారు. ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐ అఖిల్‌జామ ఆధ్వర్యంలో పెదపాడు ఎస్ఐ కట్టా శారదా సతీష్, డీటీఆర్‌బీ మధు, రోడ్డు సేఫ్టీ సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. 16వ నెంబర్ జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌గేటు వద్ద ఉన్న వై జంక్షన్‌లో స్పీడు కెమెరాలను పెట్టి వాహనాల వేగాన్ని గుర్తించారు. స్పీడ్ హంటర్ పరికరం ద్వారా మితిమీరిన వేగంతో వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చింతలపూడి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రగడవరం పంచాయితీ జార్జ్‌పేటకు చెందిన గాదే కుమార్‌రాజు (45) వ్యవసాయ పనుల్లో ఉండగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం తన పొలంలో పురుగుమందు పిచికారీ చేస్తున్నాడు. కరెంటు తీగ తెగి పడిన విషయం గమనించకుండా నీళ్లలో దిగాడు. విద్యుదాఘాతంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. ఇటీవలే అతని భార్య చనిపోయింది. అతడికి ఇద్దరు కుమారులకు వివాహం కావడంతో చిన్న కుమారుడితో కలసి ఉంటున్నాడు. మృతదేహాన్ని చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని పవర్‌పేట స్టేషన్ దాటిన తరువాత సుమారు 35 నుంచి 45 ఏళ్ల వయస్సు వ్యక్తి మంగళవారం తెల్లవారు జామున రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు సమాచారం అందడంతో సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సిమెంటు రంగు పూల డిజైన్‌తో కూడిన తెలుపు పొడవు చేతుల చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంట్, నీలంరంగు అండర్ వేయర్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద వివరాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ పి సైమన్ సెల్ నెంబర్ 9988219559కు సమాచారం అందించాలని సూచించారు.

ఎలుకల మందు తాగిన మహిళ మృతి

ఏలూరు క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తాగి అస్వస్థతకు గురైన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేసినా పరిస్థితి విషమించడంతో ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పెదవేగి మండలం కొండల రావుపాలెంనకు చెందిన కనపర్తి రేణుక (46) ఇటీవల ఎలుకల మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమెను విజయవాడ అనంతరం హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆమె పరిస్థితి ప్రమాదకరమని వైద్యులు చెప్పడంతో చివరికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించడానికి మంగళవారం రాత్రి తీసుకువచ్చారు. అత్యవసర విభాగంలో వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

వీరాంజనేయ స్వామికి అభిషేకాలు, అర్చనలు



ఏలూరుకార్పొరేషన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జ్యేష్ఠ మాసంలోని మంగళవారం కావడంతో సత్రం పాడు అంబికాదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి అభిషేకాలు, తమలపాకులు, సింధూరంతో అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల శ్రీనివాసాచార్యులు భక్తులతో వారి గోత్రనామాలతో అర్చనలు జరిపారు. అంబికా కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఏలూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వివిధ కంపెనీల్లో ఉద్యోగ నియామకాలకు బుధవారం ఉదయం 10గంటల నుంచి ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రజిత తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణతతో అప్రంటీస్ చేసిన అభ్యర్థులు, ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న ట్రైనీలు ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు హాజరుకావచ్చున్నారు. అన్ని ధ్రువపత్రాలతో అభ్యర్థులు హాజరుకావాలని, ఇతర వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయం(08812-230269)ను సంప్రదించాలని సూచించారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

చింతలపూడి, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : చింతలపూడిలో జూలై 5, 6, 7 తేదీల్లో జరగనున్న సీపీఐ ఏలూరు జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు మామిళ్ళపల్లి వసంతరావు విజ్ఞప్తి చేశారు.సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభల నేపథ్యంలో ఈ నెల 18న జిల్లా వ్యాప్తంగా మోటారు సైకిళ్ల ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. చింతలపూడి ప్రాంతంలో సీపీఐ ఆవిర్భవించి 84 ఏళ్లు గడిచిందని, దివంగత నాయకులు కె.సత్యనారాయణరెడ్డి, కంచన కాశీ, మాదాసు వీరవెంకయ్య, ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో పార్టీ శాఖ ఏర్పడిందన్నారు. సమావేశంలో హేమశంకర్, రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశ్వరరావు, సాయిబాబా, వెంకటరమణ, టి.బాబు, సోమశేఖర్, టి.వి.ఎస్.రాజు, బుచ్చిబాబు పాల్గొన్నారు.

వైసీపీ మహిళా విభాగం నిరసన

ఏలూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న హత్యలు హత్యాచారాలను నిరసిస్తూ పాత బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వైసీపీ మహిళా నేతలు నిరసన తెలిపారు. జిల్లా పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కేసరి సరితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీంచాయని, మహిళలకు చిన్న పిల్లలకు రక్షణ కరువైందన్నారు. కూటమి పాలనలో మహిళల భద్రతను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో కుంభం విజయరాజు, నగర అధ్యక్షురాలు జుజ్జవరపు విజయనిర్మల, చండీప్రియ, దున్న బేబీ, సీతారావమ్మ, సాయిల స్వాతి, తొత్తిడి వేదకుమారి, మంద జయలక్ష్మి పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో జేసీ ఆకస్మిక తనిఖీలు

జంగారెడ్డిగూడెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో జేసీ పి.ధాత్రిరెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలకు, హాస్టళ్లకు సన్న బియ్యం పంపిణీ గురించి ఎంఎల్‌ఎస్ పాయింట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని రేషన్ దుకాణం-37లో తనిఖీలు చేశారు. రేషన్ షాపు నిర్వహణ సక్రమంగానే ఉందని జేసీ కితాబిచ్చారు. 37వ రేషన్ దుకాణంలో 65 ఏళ్ళు వయస్సు దాటిన కార్డు దారులు 70 మంది ఉండగా అందరికీ సక్రమంగా రేషన్ అందజేసినట్టు తెలిపారు. జేసీతో పాటు డీఎస్‌వో శివరామ్మూర్తి, తహసీల్దార్ కె.స్లీవజోజీ, సివిల్ సప్లై డీటీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జూలై 7న ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలి

ఏలూరు క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జూలై 7న ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎంఎస్‌పి, ఎంఆర్పీఎస్ ఇన్‌చార్జి కూచిపూడి సత్యం మాదిగ పిలుపునిచ్చారు. మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జిల్లా ముఖ్య నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాదిగ మాట్లాడుతూ ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులు పిండెల భద్రం, మట్టా విద్యార్థి, ఎస్.గంగాధర్, ఎన్.రాము, పి.సాగర్, ఎంఆర్పీఎస్ జాతీయ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కాశీ కృష్ణ, ఎంఎస్‌పి ఏలూరు జిల్లా అధ్యక్షులు కందుల రమేష్, జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి మురళీకృష్ణ, నాయకులు చింతాటి కిషోర్, చొదిమెళ్ళ రాంబాబు, ఎస్.బాలరాజు పాల్గొన్నారు.

బాలల రక్షణకు చర్యలు తీసుకోవాలి : రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి):బాలబాలికల రక్షణ, విద్య, ఆహారం విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఏలూరు విద్యానగర్‌లో ఉన్న శిశుగృహాన్ని మంగళవారం జడ్జి రత్న ప్రసాద్ సందర్శించారు. అక్కడ బాలబాలికల ఆరోగ్య పరిస్థితులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలబాలికల రక్షణ, ఆహార విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలబాలికలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలను చేరేలా సొంత బిడ్డల్లా చూసుకోవాలని ఆదేశించారు. శిశు గృహ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

సాగు సమయాల్లో మెలకువలు పాటించాలి

లింగపాలెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మే నుంచే వర్షాలు ప్రారంభమవడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి కోటగిరి మురళీకృష్ణ రైతులకు సాగులో పలు సలహాలు, మెలకువలను తెలియజేశారు. రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాన్నారు. విత్తనాలను ప్రభుత్వ అనుమతులున్న షాపుల్లోనే కొనాలని, కంపెనీలకు చెందిన లేబుల్ లేని విత్తనాలు, విడిగా అమ్మే విత్తనాలను కొనుగోలు చెయ్యవద్దన్నారు. అలాగే రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సరిహద్దు తగాదాల్లో పలువురికి గాయాలు

ఏలూరు క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య ఇళ్ళ సరిహద్దు ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు నగరంలో పట్టపగలు జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయబ్రాంతులకు గురయ్యారు. ఏలూరు ఫిరంగుల దిబ్బ ప్రాంతానికి చెంది ఇబ్బా వెంకటేశ్వరరావు(56)కు అతని ఇంటి పక్కనే ఉన్న కగ్గా వెంకటేశ్వరరావు కుటుంబానికి సరిహద్దు తగాదాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం 10గంటలకు రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో ఇబ్బా వెంకటేశ్వరరావుకు, కగ్గా వెంకటేశ్వరరావులకు గాయాలయ్యాయి. వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఇబ్బా వెంకటేశ్వరరావు కుమారుడు నాగరాజు తిరిగి మధ్యాహ్న సమయంలో ఆసుపత్రి నుంచి కోర్టు సెంటర్ మీదుగా రిజిస్టర్ ఆఫీసు రోడ్డులో వెళ్తుండగా కగ్గా వెంకటేశ్వరరావు వర్గానికి చెందిన వారు కత్తులతో దాడి చేసుకున్నారు. తిరిగి రెండు వర్గాలకు చెందిన వారు గాయాల పాలవ్వగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు.

మద్ది, గోకుల పారిజాతగిరి క్షేత్రాల్లో ఎస్పీ దంపతుల పూజలు


మద్ది క్షేత్రంలో ఎస్పీ దంపతులు


జంగారెడ్డిగూడెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని ఎస్పీ కిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈఓ ఆర్.వి.చందన పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఈవో చందన ఇరువురిని స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి దర్శనం అనంతరం ఈవో మానికల రాంబాబు ఇరువురిని సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వి.రమణ, తహసీల్దారు కె.స్లీవజోజీ, డీఎస్పీ యు.రవిచంద్ర పాల్గొన్నారు.

పిల్లలకు చదువే ఆస్తిగా ఇవ్వాలి : పోలిమేర హరికృష్ణ


గ్రామ బాట పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పిల్లలకు తల్లి దండ్రులు చదువే ఆస్తిగా ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ పోలిమేర హరికృష్ణ పిలుపునిచ్చారు. శనివారంపేట గవరవరం దళితవాడలో మంగళవారం విద్యా ఆవశ్యకతపై గ్రామ-బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగపరంగా సక్రమించే విద్య, వైద్య ఇతర ఉపాధి రంగాల్లో రాణించాలంటే ప్రభుత్వం అందించే విద్యా సౌకర్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు మాట్లాడుతూ దళితులంతా ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. దళిత నాయకులు నారపాం కృష్ణ, బీఈడీ కంప్లీట్ చేసిన స్టూడెంట్స్ పాల్గొన్నారు.

ఆప్కాబ్ చైర్మన్ గన్నికి టీడీపీ నాయకుల శుభాకాంక్షలు



కామవరపుకోట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును కామవరపుకోట మండలంలోని టీడీపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు మంగళవారం భీమడోలులోని ఆయన కార్యాలయానికి వెళ్ళి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, టీడీపీ శ్రేణులు బొంతు వెంకటేశ్వరరావు, బొబ్బిలి డాన్ దివాకర్, నల్లూరి సత్తిబాబు, మేరుగు సుందరరావు ఉన్నారు.

బాల్య వివాహాలు సమాజానికి చేటు

ఏలూరు,జూన్ 10(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల వికాసం కోసం నెల రోజుల పాటు అవగాహన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మహిళా,శిశు అభివృద్ధి సంస్థ ఏలూరు రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ)గా బి.సుజాత రాణి అన్నారు.ఏలూరు గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈసారి బాలిలకు రక్తహీనత, ఇతర ఆరోగ్య జాగ్రత్తలను వివరించామన్నారు. ఐసీడీఎస్ పీడీ శారద పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: బాల్య వివాహం సాంఘిక దురాచారమని వీటిని అరికట్టడంతో పాటు బాలికలు చదువు ప్రాముఖ్యతను తెలుసుకుని ఉన్నత స్థితికి ఎదగాలని సెక్టార్‌సూపర్‌వైజర్ టి.మేరీ అన్నారు. మండలంలోని పంగిడిగూడెం పంచాయతీలోని అంగన్వాడీ కేం

అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన

ద్రంలో కిశోర బాలికల ప్రత్యేక శిబిరాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న మేరీ బాల్య వివాహాలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక కట్టుబాట్లు, సాంప్రదాయ పద్ధతులు, బాలికల భద్రత వంటి పలు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. జీఎంఎస్.కె.మొహ్మద్ ససీమ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● దెందులూరు: బాల్య వివాహాల నివారణకు పిల్లల తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంగన్వాడీ పెదపాడు ప్రాజెక్టు ఏసీడీపీవో సునీల్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం దెందులూరు మండలం దోసపాడులోని అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ గోరింక యేసుమణి, అంగన్వాడీ సెక్టార్ సూపర్ వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో కిశోరి బాలికల శిక్షణ ముగింపు కా


అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న మేరీ

ర్యక్రమాన్ని ఏసీడీపీవో సునీల్ రాజశేఖర్ మాట్లాడారు. బాల్య వివాహాల నివారణ తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. గాలాయగూడెంలో ఏఎంసీ డైరెక్టర్ మద్దా దయనందరాజు, పార్టీ అధ్యక్షుడు పూజారి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పూజారి వెంకటరత్నం నాయుడు, సెక్టార్ సూపర్ వైజర్ పద్మభూషణం ఆధ్వర్యంలో నిర్వహించారు. దెందులూరు మండలంలో సెక్టార్ సూపర్ వైజర్ చిట్టమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సమస్యలకు పరిష్కారం చూపండి



చాటపర్రులో ఆందోళన చేస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులకు కేంద్రం సమగ్ర చట్టాన్ని చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ మండలం చాటపర్రు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం వినతి పత్రం అందజేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు 700 రూపాయిల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ మండల కార్యదర్శి పొట్టేళ్ళ పెంటయ్య, బుగ్గన ప్రభాకర్, యోహాన్, కె.మంగమ్మ, ఏఐటియుసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి.కిశోర్, బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

● కొత్త ప్లాంటేషన్లకు అనుమతులు ఇవ్వలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా ఫారెస్ట్ రేంజర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో తోచిలక రాయుడుపాలెం, కొత్తపల్లి, ఉంగుటూరు, గొల్లగూడెం, తదితర గ్రామాల నుంచి వీఎస్‌ఎస్ సభ్యులు, జయరాజు, అంజయ్య, ప్రసాద్, కనకరాజు, కృపా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబురావు, దాసు పాల్గొన్నారు.

● చింతలపూడి: ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం మంగళవారం ధర్నా నిర్వహించింది. సంఘ జిల్లా అధ్యక్షులు కంచర్ల గురవయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తహ

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ సంఘం ఆందోళన

సీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో బోడా వజ్రం, ఎం.లాజర్, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: ఇచ్చిన హామీలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా చేసి తహసీల్దార్ సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు.వెల్లంకి వెంకట్రావు, పులి సత్యనారాయణ, చెమటపాము బాలసౌరి, కే.రాజు, కొమ్మంటి వెంకటేశ్వరరావు, పోలగాని సత్యనారాయణ, ఉప్పులూరి యుగంధర్, శిలారపు మద్దిరాముడు, సుందరం పాల్గొన్నారు.

● కామవరపుకోట: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ గెడ్డం ఎలీషాకు సీపీఐ నాయకులు అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులను సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సంఘ నాయకులు యడ్లపల్లి రఫాయల్, నల్లమోతుల కృష్ణ, కానూరి యేసు ఉన్నారు.

● వేలేరుపాడు: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రసాద్ మాట్లాడుతూ గోదావరి వరదల వలన వందల కుటుంబాలు ప్రతి ఏటా నష్టపోతున్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ.మున్నీర్, ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య, సీపీఐ మండల కార్యదర్శి బాడిస రాము పాల్గొన్నారు.

● కుక్కునూరు: కూటమి ప్రభుత్వం రాగానే ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలు మాటలకే పరిమితం అయ్యాయని వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి కే.బాబురావు ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు పూర్తి స్థాయిలో అమలు కావడంలేదని కార్మికులకు ప్రత్యేకహక్కులు కల్పించి చట్టాలు అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎఫ్ మండల కార్యదర్శి పొన్నే లక్ష్మయ్య, పాపారావు పాల్గొన్నారు.

● **మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా..**

బుట్టాయగూడెం: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బుట్టాయగూడెం ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె కు కార్మికులంతా తరలి రావాలన్నారు. శ్రీలక్ష్మీ, మరియ మ్మ, మంగ, చల్లమ్మ, దుర్గ, పోచమ్మ, శాంతకుమారి పాల్గొన్నారు.

● **కొల్లేరుపై రౌండ్ టేబుల్ సమావేశం..**

ఏలూరు కార్పొరేషన్: కొల్లేరు ప్రాంతాల్లో పర్యావరణంతో పాటు కొల్లేరు ప్రజల ఉపాధిని కూడా కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పేర్కొన్నారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో కొల్లేరు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ కొల్లేరు గ్రామాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చాగంటి సంజయ్‌లు మాట్లాడుతూ కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ సందర్భంగా కొల్లేరు సమస్యలపై చర్చించి కొల్లేరు కాంటూరును ఐదు నుంచి మూడుకు తగ్గించాలన్నారు.

● **మిగులు భూమి స్వాధీనం చేసుకోవాలి**

జీలుగుమిల్లి: పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకంలో ప్రభుత్వం నిర్వాసిత గిరిజనులకు కొనుగోలు చేసిన మిగులు భూములు స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మిగులు భూములపై కొంత మంది పెత్తనం చెలాయించడం తగదన్నారు. సీపీఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, .సీతారామయ్య, కొండలరావు, నాగమణి, మునియ్య గంగరాజు ఉన్నారు.

బాలయ్యకు అంబికా కృష్ణ శుభాకాంక్షలు



ఏలూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 65వ జన్మదినం సందర్భంగా సినీ నిర్మాత, ఏలూరు మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మంగళవారం హైద్రాబాదులోని జూబ్లీహిల్స్‌లో కలిసి పుష్పగుచ్ఛమందించి శుభాకాంక్షలు తెలిపారు. బాలకృష్ణ సినిమాలతో పాటు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ప్రజలకు అద్భుతమైన వైద్యసేవలు అందిస్తున్నారని ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని ఆకాంక్షించారు.

● పెదవేగి: నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు పెదవేగి మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముండూరులో టీడీపీ నాయకులు మేడికొండ ప్రసాద్, బలుసు శ్రీనివాస్ చౌదరి, సుజాన్, షేక్ ఉర్ధండు ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రాంతానికి వెళ్లి 400మంది ఉపాధి కూలీలకు అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

అర్హులందరికీ ఇళ్ల స్థలాలిస్తాం : చింతమనేని

పెదవేగి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సొంతింటి కల సాకారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలువురు ప్రజలు ఇళ్ల స్థలాలు ఇంటి నిర్మాణానికి నిధులిప్పించాలని, పింఛన్లు మంజూరు చేయాలని వినతులు అందించారు. ప్రభుత్వం ప్రజల అవసరాలకు సరిపడు ఇంటి స్థలం ఇస్తుందని, గ్రామాల్లో 3సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇచ్చేలా చర్యలు తీసుకుందన్నారు.

మహిళల రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు


సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

ఏలూరు క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : బాలికలు, యువతులు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక రక్షణ చర్యలు చేపట్టిందని వీటిపైన అవగాహన పెంచుకోవాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు అన్నారు. ఏలూరు ఎన్‌ఆర్‌పేటలో ఉన్న నారాయణ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ క్రైమ్, ర్యాగింగ్ పలు అంశాలపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ అత్యవసర పోలీస్ సహాయం కోసం 112కుగాని లేదా శక్తి టీమ్ సెల్ నెంబర్ 79934 85111కు కాల్ చేయాలని సూచించారు. తక్షణమే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటారని సూచించారు. శక్తి యాప్ మహిళల మొబైల్‌లో ఉండడం వల్ల అత్యవసర సమయాల్లో పోలీస్ సహాయం కోసం ఒక బటన్ నొక్కితే పోలీసులకు సమాచారం అందుతుందని తక్షణం పోలీసులు చేరుకుంటారన్నారు. రాత్రి వేళ మహిళలకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకూ ఉమెన్ డ్రాప్ వాహన్ జిల్లాలో అందుబాటులో ఉందని, మహిళలను వారి ఇండ్లకు పోలీస్ సిబ్బంది వాహనంలో దించుతారని వివరించారు. సైబర్ మోసాలకు గురైతే 1930కు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో మహిళా ఎస్ఐ వి.కాంతిప్రియ పాల్గొన్నారు.

జనార్దన స్వామి సేవలో జీయర్‌స్వామి


ప్రవచనాలు బోధిస్తున్న రామానుజ జీయర్‌స్వామి

ఏలూరు కార్పొరేషన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అగ్రహారంలోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని జనార్దన స్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయ్యర్ స్వామి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాన్ని వివరించారు.ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ సమాజంలో శాంతి నెలకొనాలంటే ఆధ్యాత్మిక సేవకు పునరంకితం కావాలన్నారు. దైవారాధనతో ముక్తి కలుగుతుందన్నారు. వృద్ధులను, వికలాంగులను ఆదరించాలని తద్వారా భగవంతుని అనుగ్రహం కలుగుతుందని చెప్పారు. సమాజ శాంతి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఆలయ అర్చకులు వంగల పవనకుమారాచార్యులు, వెంకటా చార్యులు బృందం భక్తులతో పూజలు చేయించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగబాబు, సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

కిశోరి వికాసంతో బాలికల్లో చైతన్యం



లింగపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అ ఘాయిత్యాలపై బాలికల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఆయా గ్రామాల్లోని సచి వాలయాల పరిధిలో పదేళ్ల నుంచి 18 ఏళ్లలోపు బా లికలకు సమాజంలోని మంచి,చెడుల గురించి వివరిం చారు.ప్రతి గ్రామానికి కన్వీనర్‌గా గ్రామ మహిళా సం రక్షణ కార్యదర్శి, సభ్యులుగా పాఠశాల టీచర్లు, అంగ న్‌వాడీ కార్యకర్త, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త, వీవోఏలను కలిపి ఒక కమిటీగా నియమించి అవగాహన కార్యక్ర మాలు చేపట్టింది. బాలికలకు చదువు ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక వేధింపులు, బాల్య వివా హాలవల్ల కలిగే అనర్థాలతో పాటు వారికి పోక్సో చట్టం, లింగవివక్ష, శారీరకవ్యాయామం, మహిళా సాధికారత, ఆటలు, పొదుపు, ఆర్థిక అంశాల నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలను అర్థమయ్యే రీతిలో వివరించారు.

బాలికలకు అవగాహన కల్పించాం



ప్రతి గ్రామంలోనూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం కార్యక్రమాలు నిర్వహించాం. బాలికలకు ఆరోగ్యం, సామాజిక భద్రతతో పాటు వారికి సమాజంలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పించాం. బాలికలతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా అర్థమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

మాధవి, సీడీపీవో, చింతలపూడి

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాస్



దెందులూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ తహసీల్దార్‌గా అంతర్వేది శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. ఏలూరు రూరల్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేస్తున్న అంతర్వేది శ్రీనివాస్‌ను కలెక్టర్ వెట్రిసెల్వి దెందులూరు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు దెందులూరు వీఆర్వో శ్రీనివాస్, కిషోర్, రామకృష్ణ, రామచంద్రరావు, పజూరి సుబ్రహ్మణ్యం, గ్రామ రెవెన్యూ అధికారులు శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు.

ఉత్తమ విద్యార్థులకు ఎంఈవో అభినందన



లింగపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డు అందుకోవడం అభినందనీయమని ఎంఈవో రామారావు అన్నారు. మండలం నుంచి అవార్డుకు ఎంపికైన షేక్ యాకూబ్ వలీ, నూర్ బాషా హనీఫ్, బొబ్బూరి శశివరుణ్, పెద్దింటి రోహిత, దేవినేని ఎన్.వి. చంద్రకౌషిక్‌చౌదరి అనే విద్యార్థులు మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడాన్ని కొనియాడారు.

విద్యార్థి మణికంఠకు అభినందనలు



పెదవేగి: లక్ష్మీపురం శివారు శ్రీసాయి హైస్కూల్లో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థి పి.ఎస్.ఎస్.మణికంఠ షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బోయపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ బోయపాటి సాయి, ఆశ, పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు అభినందించారు. కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహిస్తే వారిలో మరింత ఉత్సాహంతో జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

మంచినీటి ట్యాంకు శంకుస్థాపన

జీలుగుమిల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జల జీవన్ మిషన్‌లో భాగంగా రాచన్నగూడెం పంచాయితీ జిల్లేళ్ళగూడెం మంచినీటి ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శంకుస్థాపన చేశారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ క్రమంలో రూ.29.7 లక్షల నిధులతో ట్యాంకు నిర్మాణం చేస్తామన్నారు.అనంతరం గ్రామంలో శ్రీరామాలయం నిర్మాణానికి గ్రామస్థుల కోరిక మేరకు రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. సర్పంచ్ సున్నం వరలక్ష్మి, జనసేన ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, పార్టీ మండల అధ్యక్షులు పసుపులేటి రాము, నాయకులు కుంజా రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు, బందారు అనిల్, గుజ్జు ప్రసాద్ ఉన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మావతి

సీడీపీవోగా పద్మావతి

బుట్టాయగూడెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా యు.వి.పద్మావతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగుల బదిలీల్లో భాగంగా తూర్పు గోదావరి గోపాలపురం ప్రాజెక్టులో పని చేస్తున్న ఆమె బుట్టాయగూడెం సీడీపీవోగా రాగా ఇక్కడ పనిచేసిన ఇతులసీ ఏలూరు పీడీ ఆఫీసుకు బదిలీపై వెళ్లారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు మరింతగా చేరువయ్యేలా పనిచేస్తానని సీడీపీవో తెలిపారు.

వాహనాల తనిఖీలు

లింగపాలెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. మండలంలో ధర్మాజీగూడెంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వాహనాలకు సంబంధించిన పత్రాలను తమతో ఉంచుకోవాలన్నారు. లైసెన్సు సంబంధిత పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఏఎంవీఐ నరేంద్రబాబు బదిలీ

ఏలూరు క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఏలూరు రవాణాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పలెవెల నరేంద్రబాబును భీమవరం రవాణాశాఖ కార్యాలయంలో ఏఎంవీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అన్ని శాఖల్లో బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో రవాణాశాఖలో జరిగిన బదిలీల్లో ఏఎంవీఐగా నరేంద్రబాబును భీమవరం బదిలీ చేశారు.

బస్‌పాస్‌ల జారీ నిలిపివేత

ఏలూరు క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఆర్టీసీ ఇస్తున్న బస్‌పాస్‌లను సరికొత్త విధానంలో రూపొందుతున్న కారణంగా ఈ నెల 12, 13వ తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు మూసివేస్తున్నామని తిరిగి 14వ తేదీ నుంచి యథావిధిగా విద్యార్థులకు బస్‌పాస్‌లు ఇవ్వనున్నట్టు ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ లాగిన్‌లోకి వెళ్లి ఆన్‌లైన్ బస్‌పాస్ చేసుకుంటే టోకెన్ నెంబర్ వస్తుందని ఆ నెంబర్ తీసుకుని బస్‌పాస్ కౌంటర్‌కు వస్తే సమయం వృథాకాకుండా వెంటనే బస్ పాస్ అందిస్తామని ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి తెలిపారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలని వాణి తెలిపారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

లింగపాలెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎల్లపుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని పాచ్చానగరం గ్రామానికి చెందిన వరికూటి రమేశ్, పొన్నుబోయిన వీర్రాజు, ఎర్రగొర్ల వెంకటేశ్వరరావులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల సంక్షేమం కోరుకునే పార్టీ అని తాను కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. జి.చలపతిరావు, టి.మల్లయ్య, రవితేజ, రాములు, కిరణ్ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం

పెదపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అప్పనవీడు అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద దాత గోగినేని వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో సుమారు 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. మంగళవారం కావడంతో స్వామిని ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సన్న బియ్యంతో 'భోజనం' : ఎంఈవో

ముసునూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు సర్కార్ సన్న బియ్యాన్ని సరఫరా చేసినట్టు ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 61 పాఠశాలలకు ఈ నెలకు సరిపడా 5,725 కేజీల సన్న బియ్యం, రాగిపిండి, బెల్లం ప్యాకెట్లు సైతం నూజివీడు ఎంఎల్‌యస్ పాయింట్ నుంచి ప్రత్యేక వాహనం ద్వారా సరఫరా చేసినట్టు చెప్పారు. విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ముసునూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కిరపాటి ఆనంద్ డిమాండ్ చేశారు. ముసునూరు తహసీల్దార్ కేవీ రమణకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సాధికారత కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కర్రా రామకృష్ణ, రైతు కూలీలు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల వేదిక

ముదినేపల్లిలో కార్యక్రమం ▸ పాల్గొననున్న ఎంపీ పుట్టా

ముదినేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల వేదికను బుధవారం ముదినేపల్లిలో నిర్వహించనున్నారు. స్థానిక వి-కన్వెన్షన్ హాలులో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొని ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి మండలాల వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు. ఈ వేదికను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

రేపు ఆగిరిపల్లిలో విద్యుత్ అదాలత్

ఆగిరిపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నూజివీడు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఈఈ సత్యనారాయణ తెలిపారు. ఆగిరిపల్లిలోని పొన్నం కల్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరిస్తామని, డివిజన్ పరిధిలోని ఆగిరిపల్లి, అడవి నెక్కలం, ముసునూరు, రమణక్కపేట సెక్షన్ పరిధిలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఐటీఐలో పచ్చదనం - పరిశుభ్రత


మొక్క నాటిన వైష్ణవి

ముదినేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ఐటీఐ కళాశాలలో మంగళవారం పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి మొక్కలు నాటారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించి ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని వైష్ణవి అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ, వైద్యుడు డాక్టర్ మనోజ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యాంజలి స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ కృష్ణారావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి



నూజివీడు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నూజివీడు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి జి. రాజు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు రంగారావు, అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని జ్యోత్స్నకు సత్కారం



కైకలూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఒకేషనల్ కోర్సులో అత్యధిక మార్కులు సాధించిన పెనుముడి జ్యోత్స్నను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి సత్కరించి రూ.5 వేలు నగదు, మెమెంటోను అందజేశారు. ఈమె ఎమ్మెల్టీ గ్రూపులో 952 మార్కులు సాధించి ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకుందని మాల్యాద్రి తెలిపారు. ప్రముఖ వైద్యులు పెరుమాళ్ళ పుల్లేశ్వరరావు, కైకలూరు 9వ వార్డు సభ్యుడు మంచిగంటి శ్రీనివాసరావు, అద్దెపల్లి బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో చేర్పించాలని ఇంటింటి ప్రచారం



ముదినేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): 'మా హాస్టల్‌లో చేర్పించండి - మీ పిల్లలకు మంచి ఆహారంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందిస్తాం' అంటూ ముదినేపల్లిలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహ సంక్షేమ అధికారి బి.సురేష్ బాబు ప్రచారం చేపట్టారు. మంగళవారం ముదినేపల్లి మండలం చినకామనపూడి, చేవూరు, కాకరవాడ, కోడూరు గ్రామాల్లో తల్లిదండ్రులను కలసి హాస్టల్‌లో అందించనున్న సేవలను వివరించారు. అనుభవజ్ఞులైన ట్యూటర్లతో సబ్జెక్టుల బోధన నిర్వహిస్తున్నట్లు వివరించారు. పై గ్రామాల్లోని యూపీ పాఠశాలలు రద్దయినందున విద్యార్థులను తమ హాస్టల్‌లో చేర్పిస్తే 6, 7, 8 తరగతులకు ముదినేపల్లి హైస్కూల్‌లో ప్రవేశాలు కల్పిస్తామని ఆయన తెలిపారు.



ఖరీఫ్ పనులు ప్రారంభం

ముమ్మరంగా వరి నారుమడులు

చాట్రాయి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చాట్రాయి పరిధిలో రైతులు ఖరీఫ్ వరి నారుమళ్లు ముమ్మరంగా పోస్తున్నారు. రైతులు తమ భూమిలో కొంత బాగంలో దమ్ము చేసి వరి విత్తనాలు నాటుతున్నారు. దాదాపు రైతులందరికీ బోరు బావులు ఉన్నందున బోరు నీటితో నారుమళ్ళు పెంచి జూలై మొదటి పక్షంలో నాట్లు వేస్తున్నారు. ఈ విధానం వల్ల మిగతా గ్రామాల కంటే ఒక నెల ముందుగా వరి కోతకు వస్తుంది. అలాగే రబీ మొక్కజొన్న కూడా ఒక నెల ముందే విత్తనాలు నాటి ముందుగా పంట పండిస్తున్నారు. ఇక్కడి రైతులు ఖరీఫ్, రబీ పంట కాలాన్ని ఒక నెల ముందుకు తెచ్చి లాభాలు పొందుతున్నారు. ముందుగా పంట చేతికి వస్తుండటం వల్ల వరి పచ్చి ధాన్యం అధిక ధరకు ఉప్పుడు మిల్లులకు కొనుగోళ్ళు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


నూజివీడులో సాక్షి దినపత్రిక ప్రతుల దహనం


కైకలూరులో నిరసన మహిళల ర్యాలీ


చనుబండ నుంచి నూజివీడుకు తెలుగు మహిళలు


ముసునూరు నుంచి నూజివీడు ర్యాలీకి..

సాక్షి చానల్‌ను మూసేయాలి

▸ కైకలూరు, నూజివీడుల్లో మహిళల భారీ ర్యాలీ ▸ సాక్షి ప్రతుల దహనం

కైకలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సాక్షి టీవీ చానల్‌ను తక్షణమే మూసివేయాలని జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి డిమాండ్ చేశారు. మంగళవారం కైకలూరులో పెద్దఎత్తున మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి ఛానెల్‌లో మహిళలను కించపరిచేలా మాట్లాడడం దారుణమని వారిని కఠినంగా శిక్షించడంతో పాటు సాక్షి టీవీ ప్రసారాలను నిలిపివేయాలన్నారు. మహిళలపట్ల అనుచితంగా మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి భార్య భారతీరెడ్డి స్పందించకపోవడం దారుణమని, ఆమె తక్షణమే అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు బంకపల్లి సీతమ్మ, కైకలూరు మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు గంగుల శ్రీదేవి, కల్యాణి, రమణ, ఆళ్ళ లక్ష్మీ, భారతీ, శ్యామల, రెడ్డి రాధిక, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో కదం తొక్కిన మహిళలు

నూజివీడు టౌన్: మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసి కుట్రపూరితంగా వ్యవహరించిన సాక్షి ఛానల్, సాక్షి పత్రికపై చర్యలు తీసుకుంటూ వాటిని మూసివేయాలని కోరుతూ నూజివీడు పట్టణంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలని, జగన్ కుట్రపూరిత వ్యవహారాలపై సమగ్ర విచారణ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళలు నినాదాలు చేశారు. సాక్షి ప్రతులను దహనం చేశారు. సాక్షి మీడియాలో రాజధాని ప్రాంత మహిళలను అగౌరవపరిచేలా మాట్లాడటంపై అందరూ నిరసన తెలుపుతుంటే వైసీపీ అధినేత జగన్ మాత్రం కక్ష సాధింపు అనడం దారుణమన్నారు. నూజివీడు మున్సిపల్ కౌన్సిలర్లు కొమ్మన విజయ, తిరుమలశెట్టి లక్ష్మీ సాధన స్రవంతి, మాజీ కౌన్సిలర్లు గోలు దుర్గాదేవి, బత్తుల వారి గూడెం సర్పంచ్ ముసునూరు లక్ష్మీ కాంతమ్మ, టీడీపీ నాయకులు లక్ష్మీ గౌరేశ్వరి, నజీ మా, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు ఎం. నాగరాణి, వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు. నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కె. శ్రీనివాసరావు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ దుర్గాప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్ తదితరులు సంఘీభావం తెలిపారు.

ర్యాలీకి తరలిన శ్రేణులు

చాట్రాయి: అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గ కేంద్రం నూజివీడులో కూటమి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన నిరసన ర్యాలీకి చాట్రాయి మండలం నుంచి అధిక సంఖ్యలో మహిళలు, కూటమి శ్రేణులు తరలివెళ్ళారు. చనుబండ నుంచి తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు నక్కా రాము, గవర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 100 మంది, బూరుగుగూడెం నుంచి టీడీపీ నాయకుడు తేళ్ళూరి శేఖర్ ఆధ్వర్యంలో 25 మంది మహిళలు తరలి వెళ్ళారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, నాయకులు తరలారు.

ముసునూరు: అమరావతి మహిళలు, రాజధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుతోపాటు సాక్షి ఛానల్‌పై కూడా చర్యలు తీసుకోవాలని మంత్రి పార్థసారథి ఆధ్వర్యంలో నూజివీడులో మంగళవారం జరిగిన భారీ ర్యాలీకి మండల వ్యాప్తంగా కూటమి శ్రేణులు తరలివెళ్లాయి. పార్టీల గ్రామ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఆటోలు, ఇతర వాహనాల్లో కూటమి మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్ళారు. ముసునూరులో నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను ఆధ్వర్యంలో మహిళలు తరలారు. గోపవరంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్, గుళ్ళపూడిలో గ్రామ అధ్యక్షులు మందలపు ధర్మరాజు తదితరులు మహిళలను వాహనాల్లో ర్యాలీకి తీసుకు వెళ్ళారు.

నూజివీడు మామిడికి గడ్డుకాలం

▸ ధర లేక కుదేలైన రైతులు ▸ ఏటా నష్టాలు
▸ చిత్తూరు ధర ఇక్కడ కూడా ఇవ్వాలంటున్న మామిడి రైతులు


కొనేవారు లేకపోవడంతో మామిడి కాయలను గోతిలో వేసి పూడుస్తున్న దృశ్యం

(నూజివీడు, ఆంధ్రజ్యోతి)

మామిడి అనగానే సహజంగానే అందరికీ గుర్తుకు వచ్చేది నూజివీడు.. ఈ ఏడాది ఈ ప్రాంత మామిడి రైతు దారుణంగా కుదేలయ్యాడు. మార్కెట్‌లో కొనేనాథుడు లేక రైతులు తమ పంటను కోయకుండానే చెట్టుపైనే వదిలేస్తున్నారు.

పచ్చడికి ఉపయోగపడే తోతాపురి టన్ను రూ.3 వేలకు కూడా కొనే పరిస్థితి లేదు. చివరకు ముక్కల కర్మాగారాలు మూతపడ్డాయి. ప్రస్తుతం అతి కష్టం మీద తోతాపురి రూ.2 వేల నుంచి రూ.5 వేలు పలుకుతోంది. ఈ ధర రైతుకు కాయ కోత కోయడానికి కూలీలకు, ట్రాన్స్‌పోర్టుకు కూడా చాలట్లేదు. నూజివీడుతో పాటు చిత్తూరు జిల్లాలో మామిడి విస్తారంగా సాగవుతుంది. అక్కడ నూజివీడుకన్నా ఎక్కువ సంఖ్యలో మామిడి పల్ప్ పరిశ్రమలు ఉన్నాయి. గత ఏడాది ఉత్పత్తి నిల్వలు మిగిలిపోవడం, ఈ ఏడాది ఎగుమతులు లేక ఉత్పత్తి నిలిపివేశారు. అక్కడ తోతాపురి కాయకొనే పరిస్థితి లేక ఆ ప్రాంత రైతు సంఘాలు, మామిడి రైతులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. కొద్ది రోజుల క్రితం చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వీరంతా చర్చించి రైతుల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం టన్ను రూ.12 వేలకు తోతాపురి కొనాలని పల్ప్ కర్మాగారాల యజమానులను ఆదేశించింది. దానిలో రూ. 4 వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపింది. దీనిపై సమీక్షించడానికి స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ నెల 12న చిత్తూరులో పర్యటించనున్నారు.

మూతపడిన పల్ప్ యూనిట్లు

నూజివీడులో ఐదు పల్ప్ ఉత్పత్తి కర్మాగారాలు ఉన్నాయి. అవి మూతపడి సంవత్సరాలు అయ్యింది. నూజివీడు ప్రాంతంలో రైతు సంఘాలు బలంగా లేకపోవడం రైతుల్లో ఐక్యత లేకపోవడం ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వల్ల మామిడి రైతులకు ప్రతీ ఏటా తీవ్ర నష్టం జరుగుతోంది. ఇక్కడ మామిడి పరిశోధన కేంద్రం, రూ.40 కోట్లుతో నిర్మించిన వేపర్ హీట్ ట్రీట్మెంట్ ప్లాంట్ రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. ట్రీట్మెంట్ ప్లాంట్ మూతబడి నాలుగేళ్ల అయ్యింది. పల్ప్ కేంద్రాలు పనిచేస్తే తోతాపురి కాయలకు కనీస ధర అయినా అందేదని అంటున్నారు.

ప్రతిసారీ వాగ్దానాలే

ప్రతి ఎన్నికల సమయంలోనూ అన్ని రాజకీయ పార్టీల నాయకులు నూజివీడు నియోజకవర్గం మామిడి సమస్యలను పరిష్కరిస్తామని వాగ్దానాలు ఇవ్వడం షరామాములైంది. ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం నూజివీడు శివారులోని సిద్ధార్థ నగర్ ప్రాంతంలో మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు చేసిన ప్రకటన ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఇక ప్రస్తుతం విజయవాడలో ఉన్న మార్కెట్ లాగా నూజివీడు మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేస్తామని చేసిన హామీ కాగితాలకే పరిమితమైంది. మామిడి పంట చివరి దశకు వచ్చింది. రాజకీయ పార్టీల నాయకులు, రైతు సంఘాలు వెంటనే దృష్టి సారించి చిత్తూరులో లాగా ప్రభుత్వం నూజివీడు రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఈ ప్రాంత రైతాంగం కోరుతోంది.

ఆదుకోవాలి..



చిత్తూరు జిల్లాలో మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకున్న విధంగా నూజివీడు ప్రాంతంలోని రైతులను ఆదుకోవాలి. మ్యాంగో బోర్డును ఏర్పాటు చేసే ప్రయత్నాలు వెంటనే ప్రారంభం కావాలి. బోర్డు ఉంటే పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుని ప్రభుత్వం ద్వారా పరిస్థితిని చక్కదిద్దుకునే అవకాశం ఉండేది. మామిడికి ఉన్న ఇన్స్యూరెన్స్ పథకం ఏమాత్రం రైతులకు ఉపయోగపడలేదు. ఒక్క రైతుకు కూడా ఇన్సూరెన్స్ ఇచ్చిన పరిస్థితి లేదు. మూతబడిన పల్ప్ యూనిట్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

-లావు నాగ వరప్రసాద్, మామిడి రైతు


ఉపాధి పనులను పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ

ఉపాధి పనులను పరిశీలించిన కమిషనర్ కృష్ణతేజ

ఆగిరిపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎం. కృష్ణతేజ మంగళవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆగిరిపల్లి, చొప్పరమెట్ల, తాడేపల్లి, చిన్నాగిరిపల్లి, తోటపల్లి గ్రామాలలో ఉపాధి హామీ పనులు హార్టికల్చర్ (మామిడి, గులాబీ తోట)లను పరిశీలించారు. తాడేపల్లిలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను, చెరువులలో పూడికతీతను పరిశీలించారు. ఆగిరిపల్లి, చొప్పరమెట్ల గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను, గోకులం షెడ్లను పరిశీలించారు. పంచాయతీ ఆర్థిక వనరులను పెంచాలని సూచించారు. జిల్లాలోని ఉపాధి పనుల పెండింగ్ బకాయిలు రూ. 130 కోట్లు విడుదల చేసినట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ సుబ్బారావు తెలిపారు. డీపీవోకే అనురాధ, డీఎల్పీవో సుందరీ, ఎంపీడీవో భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

కలిదిండి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ఎంఈవో శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మొత్తం 66 ప్రభుత్వ పాఠశాలల్లో 4176 మంది విద్యార్థులకు 21814 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామన్నారు.

ఉద్యోగుల బదిలీ

చాట్రాయి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ముగ్గురు ఉద్యోగులు సాధారణ బదిలీలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో వివిధ కార్యాలయాలకు బదిలీ అయ్యారు. కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కమలా విష్ణు గంపలగూడెం, సీనియర్ అసిస్టెంట్ సీతారామారావు ఏ. కొండూరు ఎంపీడీవో కార్యాలయాలకు, జూనియన్ అసిస్టెంట్ నవ్య తిరువూరు పంచాయతీరాజ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

అన్నదాన పథకానికి విరాళం

ముదినేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం వెంట్రప్రగడకు చెందిన అశ్వనీ కుమార్ రూ.50 వేలు విరాళం అందజేశారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం : కామినేని


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వెంకటాపురం వంతెన వద్ద పెదకొమ్ములేరు డ్రెయిన్ పూడికతీత పనులను పరిశీలించి మాట్లాడుతూ పొలాలు ముంపు బారిన పడకుండా మురుగు కాల్వలను ప్రక్షాళన చేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మురుగు, పంట కాలువల పూడికతీత పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో ఈ దుస్థితి నెలకొందన్నారు. సార్వా ప్రారంభమయ్యేలోగా మురుగు, పంట కాల్వల పూడికతీత పనులు పూర్తి చేస్తామన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు, డ్రైనేజీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి రూ. 5 లక్షల పంపిణీ

కోరుకొల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బుసనబోయిన సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులకు మంగళవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రమాద బీమా పరిహారం కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును పంపిణీ చేశారు. రూ.100 చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకున్నందుకుగాను రూ.5 లక్షల ప్రమాద బీమా పరిహారం మంజూరైందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ ఎంపీపీ వలవల రామారావు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం, డీసీ చైర్మన్ పేటేటి సత్యనారాయణ, యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీహరి, జనసేన నాయకుడు రమేష్ పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ | ఉపాధి కూలీల ఆరోపణ


నందిగామలంకలో ఉపాధి పనులపై విచారణ

మండవల్లి జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామలంక ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్టు ఉపాధి కూలీలు ఆరోపించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా నిర్వహించిన గ్రామసభలో పెద్దఎత్తున ఆరోపణలు చేశారు. జాబ్ కార్డులకు డబ్బులు వసూలు చేస్తున్నాడని, తనకు నచ్చిన వాళ్లకి పనులు కల్పిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలు రాకపోయినా వస్తున్నట్టు మస్తర్లు వేసి సగం సగం పంచుకుంటున్నట్టు వివరించారు. దీనిపై సామాజిక తనిఖీలో ఎస్సార్పీ వెంకటేశ్వరరావు పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. సర్పంచ్ నేతల నాగరాజు, జిల్లా రిసోర్స్ పర్సన్ నవీన్ రవికుమార్, మాజీ ఎంపీటీసీ వంగలపాటి ఉషారాణి పాల్గొన్నారు.

రీ షెడ్యూల్లో 1340 మంది విద్యార్థుల దరఖాస్తు

నూజివీడు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలో గల నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువు రీషెడ్యుల్ చేసిన అనంతరం 1340 మంది విద్యార్థులు దరఖాస్తు చేసినట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలో గల నూజివీడు, ఆర్కేవ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో 4400 ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సీట్లకు గాను అడ్మిషన్ల ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. తొలుత 49,201 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాల వల్ల ట్రిపుల్ ఐటీ ప్రవేశాల గడువును పెంచాలని పాఠశాల విద్యాశాఖ కోరింది. ఈ నేపథ్యంలో అడ్మిషన్ల ప్రక్రియను రీ షెడ్యూల్ చేస్తూ ఈ నెల 2వ తేదీ నుంచి పదవ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరించనున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికారులు ప్రకటించారు. దీంతో నూతనంగా 1340 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు, మొత్తం 50,541 మంది విద్యార్థులు దరఖాస్తు చేసినట్లు రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

ముదినేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఐనంపూడిలోని వినాయక, వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సమేత బలుసులమ్మ ఆలయంలో మంగళవారం స్వామివార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు ఆలయ ఆవరణలోని పుట్టలో పాలు పోశారు. బలుసులమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవస్థానం కమిటీ అధ్యక్షుడు పెద్దింటి కృష్ణమూర్తి పర్యవేక్షణలో భారీ అన్నసమారాధన జరిగింది. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు తదితరులు పూజలు జరిపారు.


నూతన కమిటీని అభినందిస్తున్న నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ తదితరులు

టీడీపీ లోకుమూడి గ్రామ కమిటీ

మండవల్లి జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం లోకుమూడి టీడీపీ గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ సభ్యులను ఏకగ్రీవం చేయడంతో ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జ సురేష్‌బాబు, మాజీ సర్పంచ్ దోనేపూడి బుజ్జి అభినందించారు. అధ్యక్షుడిగా చీలి వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా వెంట్రుపాటి మోహన్, ప్రధాన కార్యదర్శిగా బోస్ విజయకుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. చావలిపాడు మాజీ ఎంపీటీసీ గంగుల ఆదినారాయణ, బాషా తదితర నాయకులు పాల్గొన్నారు.


పైకప్పు లేచిపోయిన చాట్రాయి సంపద తయారీ కేంద్రం

సంపద కేంద్రానికి తీవ్ర నష్టం

చాట్రాయి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీ నాటి గాలివాన బీభత్సానికి చాట్రాయిలోని సంపద కేంద్రానికి తీవ్ర నష్టం వాటిల్లింది. కేంద్రం పైకప్పు రేకులు లేచిపోవటంతో, తయారైన వానపాముల ఎరువు నాశనమైంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఇంటింటికి వెళ్ళి తడి, పొడి చెత్త సేకరించి, చెత్త నుంచి సంపద తయారు చెయ్యాలనే లక్ష్యంతో ఈ కేంద్రం నిర్మించారు. తొలుత తాటిఆకులతో షెడ్డు నిర్మించగా గాలుల తీవ్రతకు కుప్పకూలింది. తరువాత పంచాయతీ ఆధ్వర్యంలో రేకుల షెడ్డును నిర్మించారు. వైసీపీ హయాంలో ఐదేళ్లూ ఈ కేంద్రాలు మూలపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించారు. మండలంలో అన్ని గ్రామాలకు ఆదర్శంగా ఉండాలని ఈ కేంద్రాన్ని అధికారులు మోడల్‌గా తయారు చేశారు. మళ్ళీ ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలంటే సుమారు రూ. లక్ష అవుతుందని అంచనాలు తయారు చేసి అధికారులను నివేదిక ఇచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి ఎంవీఎస్ నాగరాజు తెలిపారు.